www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 21 | సంచిక : 12 | హైదరాబాద్ | మంగళవారం,జూన్ 16 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|---|

## భారత అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రం..
## లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష సక్సెస్

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (DRDO) మరో కీలక మైలురాయిని అధిగమించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన లాంగ్ రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ క్షిపణి (ఎల్ఆర్ఎల్ఏసీఎం)ని సోమవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ఈ ఫ్లైట్-టెస్ట్ నిర్వహించారు. ఈ ప్రయోగం నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తిగా చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

2లో..



## డీల్ కుదిరింది... అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

అమెరికా : కొన్ని నెలల పాటు ప్రపంచాన్ని కలవర పెట్టిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ఎట్టకేలకు చెక్ పడింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎలాంటి సుంకం లేకుండా హోర్ముజ్

2లో..




## మంచిర్యాల ఎమ్మెల్యే గుండాగిరి బంద్ చెయ్

- ఈ గడ్డ మీది నుంచే తెలంగాణ రక్షణ సేన రాజకీయం చేస్తుంది
- కవిత హెచ్చరిక

**(భారత శక్తి)** మంచిర్యాల మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను గుండాగిరి బంద్ చెయమని తెలంగాణ రక్షణ సేన నేత కవిత హెచ్చరించారు. ఈ గడ్డ మీది నుంచే తెలంగాణ రక్షణ సేన రాజకీయం చేస్తుంది. ఈ ప్రాంత ప్రజల ప్రేమను పొంది అన్ని చోట్ల టీఆర్ఎస్ జెండా ఎగురేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ

2లో..



## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి

**న్యూఢిల్లీ (భారత శక్తి)** యువతలో ఆన్‌లైన్‌లో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి

2లో..






## మెట్రో విస్తరణపై
# కేంద్రం వివక్ష



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం**

- 'ఎల్ అండ్ టీ' నుంచి మెట్రో స్వాధీనం..
- కేంద్రం ఆంక్షల వల్లే ఈ నిర్ణయం
- జపాన్ నిధులను అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి..
- సీఎం సంచలన ఆరోపణలు

**హైదరాబాద్: జూన్ 15 భరత శక్తి,** అంతర్జాతీయ నగరంగా వెలుగొందుతున్న హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు మలిదశ విస్తరణ, కేంద్ర ప్రభుత్వ వైఖరి, పాత ప్రభుత్వ నిర్వాకాలపై పత్రికా ముఖంగా జంటనగరాల ప్రజలకు, 'కోర్' (CURE) పరిధిలోని నివాసితులకు వాస్తవాలను వివరించారు.

### కాంగ్రెస్ దార్శనికత.. గత ప్రభుత్వ అలసత్వం

హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రవాణా వ్యవస్థ ఉండాలనే ఉద్దేశంతో వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుకు అంకురార్పణ చేసిందని సీఎం గుర్తుచేశారు. ఆనాడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి చొరవతో హైదరాబాద్‌కు మెట్రో ప్రాజెక్టు మంజూరైందని, వై.ఎస్. మరణానంతరం రోశయ్య

2లో..




# ప్రైవేటు బడి దోపిడీ..

## విద్యాధికారుల అండదండలు!

- పుస్తకాలు, దుస్తుల పేరిట ప్రైవేట్ స్కూళ్ల దందా
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ యంత్రాంగం
- లంచాల మత్తులో క్షేత్రస్థాయి పరిశీలనలు శూన్యం..!
- ఫీజు నియంత్రణ కమిటీ ఎక్కడ
- విద్యాశాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలి..!
- అవినీతి నిరోధక శాఖ నిఘా పెట్టాలని తల్లిదండ్రుల డిమాండ్..!

సొసైటీలో తమ "స్థాయి"ని ప్రదర్శించుకోవడానికి మధ్యతరగతి తల్లిదండ్రులు కార్పొరేట్ స్కూళ్ల బ్రాండ్ల వెంట పడటం నేడు ఒక సామాజిక జాడ్యంగా మారింది. పిల్లవాడి చదువు జ్ఞానార్జన కోసం కాక, పక్కింటివారితో పోటీ పడే ఒక అహంకార ప్రదర్శనగా రూపాంతరం చెందింది. తల్లిదండ్రుల ఈ భయాన్ని, బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విద్యాసంస్థలు అక్షరాలా వ్యాపార సామ్రాజ్యాలను నడుపుతున్నాయి. స్కూల్ ఫీజుల పేరిట జేబులు గుల్ల చేయడమే కాకుండా, యూనిఫారాలు, పుస్తకాలు, బెల్టుల వరకు తామే విక్రయిస్తూ గుత్తాధిపత్యాన్ని చలాయిస్తున్నాయి. విద్యాహక్కు చట్టాలను, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, 'లాభాపేక్ష లేని సేవ'గా ఉండాల్సిన విద్యను అత్యంత లాభదాయకమైన కార్పొరేట్ దోపిడీ కేంద్రాలుగా మార్చేశారు. ఈ హోదా భ్రమల వెనుక మధ్యతరగతి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి.

2లో..

**(పరిశోధనాత్మక పాత్రికేయులు.. ఎం.వేణుగోపాల్ రెడ్డి.. మీ "వి.జీ..)**



## పశ్చిమాసియాలో శాంతికి మార్గం..
### అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని

- అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్టు ప్రకటన
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్లు ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష

**న్యూఢిల్లీ (భారత శక్తి)**

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్లు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని

2లో..

## స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి (భారత శక్తి)** సింగపూర్ పర్యటనలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి సింగపూర్లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పుడు భారత్ నిద్రపోతున్న ప్రాంతం కాదు.. సంస్కరణలతో దూసుకుపోతున్న అతి పెద్ద ఆర్థికశక్తి. ప్రధాని మోదీ లాంటి ఆధునిక ఆలోచనలు ఉన్న వ్యక్తి దేశాన్ని ఓ అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టింది. కానీ భారత్కు అంత సమయం పట్టటం లేదు. మెడికల్ టెక్నాలజీ సహా ఇతర ఆధునిక పరికరాల తయారీలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇప్పుడు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయి. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉంది. తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్లో మేం వన్ ఫ్యామిలీ వన్

2లో..

# ఎన్‌టీఏ నిర్లక్ష్యం

- నీట్ రీ-ఎగ్జామ్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో సాంకేతిక లోపాలు
- అభ్యర్థుల తీవ్ర అవస్థలు - జూన్ 14న విడుదలైన హాల్ టికెట్లు
- జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్




న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: నీట్ రీ-ఎగ్జామ్ హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) స్పందించింది. హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో అభ్యర్థులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాల వల్ల అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి ఎన్‌టీఏ విచారం వ్యక్తం చేసింది. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అభ్యర్థులందరికీ వీలైనంత త్వరగా అడ్మిట్ కార్డులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎన్‌టీఏ ఈ సందర్భంగా భరోసా ఇచ్చింది.

## బాల్య వివాహం బతుకు ఆగంపై రాష్ట్రవ్యాప్త పోరు

- తరుణి స్వచ్ఛంద సంస్థ తో అవగాహన ఒప్పందం చేసుకున్న తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ

**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్రంలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణలను అరికట్టేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక అడుగు వేసింది. ఈ దిశగా బాలికల సాధికారత, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న తరుణి స్వచ్ఛంద సంస్థతో మహిళా, శిశు సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఒఝా, తరుణీ ఫౌండర్స్ మమతా రఘువీర్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది

2లో..



## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను ఒప్పించలేకపోయారు: రేవంత్ పై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్ (భారత శక్తి)** మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే సీఎం నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యూపీ, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తేలేకపోయారో రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా తన 'పెద్దన్న'ను (మోదీ) ఒప్పించలేకపోవడం ఆయన చేతకానితనానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు

2లో..



# ప్రైవేటు బడి దోపిడీ..

**భారత శక్తి జూన్ 15, హైదరాబాద్:** తెలంగాణలో ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం పరాకాష్టకు చేరింది. విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే చాలు.. ఫీజుల మోతతో పాటు పుస్తకాలు, పాఠశాల దుస్తుల (యూనిఫామ్స్) అమ్మకాల పేరిట ప్రైవేట్ యాజమాన్యాలు బహిరంగ దోపిడీకి తెరలేపుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర విద్యాబోర్డుల నిబంధనలను బేఖాతరు చేస్తూ, తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నా.. నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారు. మండల విద్యాధికారులు (ఎంఈఓ), జిల్లా విద్యాధికారుల (DEOs) కార్యాలయాలు లంచాల లూటీకి కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవస్థీకృత దోపిడీపై అవినీతి నిరోధక శాఖ (ACB) తక్షణమే రంగంలోకి దిగి నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది.

### సిండికేట్ సామ్రాజ్యం.. ఐదింతల ధరలు!

కేంద్ర విద్యా బోర్డు (సీ.బీ.ఎస్.ఈ) స్పష్టమైన ఆదేశాల ప్రకారం.. ఏ పాఠశాల ప్రాంగణంలోనూ ఎలాంటి వాణిజ్యపరమైన విక్రయాలు జరపకూడదు. విద్యార్థులు తమకు నచ్చిన చోట పుస్తకాలు, దుస్తులు కొనుగోలు చేసే స్వేచ్ఛను కల్పించాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కృత్రిమ పబ్లిషర్స్ మాయాజాలం: ప్రభుత్వ గుర్తింపు పొందిన పుస్తకాల ధర 500 నుండి 1000 లోపే ఉంటే, ప్రైవేట్ ప్రచురణకర్తలతో కుమ్మక్కైన యాజమాన్యాలు 5,000 నుండి 10,000 వరకు ధరలు నిర్ణయించి ఆ పుస్తకాలనే కొనాలని ఒత్తిడి తెస్తున్నాయి.నిర్దేశిత దుకాణాల **దందా:** ఫలానా దుకాణంలోనే వస్తువులు కొనాలంటూ పాఠశాలల యాప్‌లు, సామాజిక మాధ్యమాల (వాట్సాప్) గ్రూపుల ద్వారా హుకుం జారీ చేస్తున్నారు. మార్కెట్ ధర కంటే 3 నుండి 4 రెట్లు అధికంగా వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

### కాగితాలకే పరిమితమైన ఫీజు నియంత్రణ


రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు సంబంధించి గతంలో ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ వేసినా, జీవో నెంబర్ 46 తీసుకొచ్చినా.. అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. పొరుగు రాష్ట్రాల తరహాలో ఇక్కడ ఒక శాశ్వత, స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిటీ (FRC) లేకపోవడం ప్రైవేట్ యాజమాన్యాలకు వరంగా మారింది. ఏటా 10 నుండి 20 శాతం మేర ఫీజులు పెంచుకుంటూ పోతున్నా విద్యాశాఖ కనీస నోటీసులు కూడా జారీ చేయడం లేదు.

### లంచాల మత్తులో విద్యాశాఖ.. ఏసీబీ తనిఖీలు అనివార్యం!

ఈ మొత్తం దందా వెనుక మండల విద్యాధికారులు (MEOs), జిల్లా విద్యాధికారుల (DEOs) పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. పాఠశాలల గుర్తింపు (రికగ్నిషన్) మరియు వార్షిక తనిఖీల సమయంలో క్షేత్రస్థాయికి వెళ్లకుండానే, ఏసీ గదుల్లో కూర్చొని అనుమతులు మంజూరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

### నిబంధనల ఉల్లంఘనలు ఇవే:

అగ్నిమాపక అనుమతులు (Fire Safety): వందలాది విద్యార్థులుండే భవనాలకు కనీస అగ్నిమాపక రక్షణ లేకపోయినా నివేదికలు అనుకూలంగా మారుతున్నాయి. ఆటస్థలాలు (Playgrounds): కనీస ఆటస్థలం లేని అపార్ట్‌మెంట్ స్కూళ్లకు సైతం ఏటా గుర్తింపులు లభిస్తున్నాయి. ఉచిత విద్యకు పాతర: విద్యా హక్కు చట్టం (RTE-2009) ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల నిబంధనను పూర్తిగా తుంగలో తొక్కారు. ఈ అక్రమాలపై కేవలం విద్యాశాఖ అంతర్గత విచారణలు సరిపోవని, ప్రతి మండల, జిల్లా విద్యాశాఖ



కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ACB) ప్రత్యేక నిఘా విభాగాలను రంగంలోకి దించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. అధికారుల ఆస్తులపై, పాఠశాలల నుండి అందుతున్న ముడుపులపై సమగ్ర విచారణ జరిపితేనే ఈ 'బడి దోపిడీ'కి అడ్డుకట్ట పడుతుందని తల్లిదండ్రుల సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

# మెట్రో విస్తరణపై కేంద్రం వివక్ష

ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మెట్రో మొదటి దశ (ఫేజ్-1) కొరకు ఒప్పందాలు జరిగాయని వివరించారు. "2017 నాటికే పూర్తి కావాల్సిన మెట్రో మొదటి దశను, తెలంగాణ ఏర్పాటైన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం చారిత్రక కట్టడాల సాకుతో అడ్డుకుంది. కేసీఆర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రాజెక్టు మూడేళ్లు ఆలస్యమైంది. దీనివల్ల రూ. 15 వేల కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టు వ్యయం ఏకంగా రూ. 22 వేల కోట్లకు చేరింది." ప్రాజెక్టు ఆలస్యం కావడం, దానికి తోడు కోవిడ్ (కరోనా) ప్రభావం వల్ల మెట్రో నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ' తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల పాలనలో మెట్రో విస్తరణను పూర్తిగా విస్మరించిన నాటి ప్రభుత్వం, తమ సొంత ఆస్తులను పెంచుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చిందని, ఫలితంగా దేశంలోనే అగ్రస్థానంలో ఉండాల్సిన హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి పడిపోయిందని దుయ్యబట్టారు.

### కేంద్ర ప్రభుత్వ నిబంధనలు - రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యామ్నాయాలు

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెట్రో రెండో దశ (ఫేజ్-2) విస్తరణకు శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా తానే స్వయంగా ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, మొదటి దశను నిర్మించిన 'ఎల్ అండ్ టీ' సంస్థతోనే రెండో దశను కూడా నిర్మించాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం విధించిందని పేర్కొన్నారు.రూ. 30 వేల కోట్ల విలువైన ఆస్తిని సృష్టించినప్పటికీ, ఏటా రూ. 400 కోట్ల నష్టం వస్తోందని, గత నష్టాల భారం వల్ల తాము రెండో దశ నిర్మాణంలో భాగస్వామ్యం కాలేమని, భవిష్యత్ నిర్వహణను కూడా చేపట్టలేమని 'ఎల్ అండ్ టీ' సంస్థ స్పష్టంగా తిరస్కరించిందని సీఎం వెల్లడించారు.

### ఏకైక పరిష్కారం: మెట్రో స్వాధీనం

ఈ సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా, 'ఎల్ అండ్ టీ' సంస్థ నుంచి మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవడం ఒక్కటే ఏకైక మార్గమని కేంద్రం సూచించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్రం సూచనల మేరకే రూ. 30 వేల కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 వేల కోట్లకే కొనుగోలు చేసిందని ఆయన ప్రకటించారు.

### కిషన్ రెడ్డి అడ్డంకులు.. నిధుల నిలిపివేత




బ్యాంకుల నుంచి 8.25 శాతం వడ్డీకి 'ఎల్ అండ్ టీ' తీసుకున్న రూ. 13,600 కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వానికి పీఎఫ్‌సీ (PFC), ఆర్ఈసీ (REC) సంస్థల ద్వారా ఎలాంటి గ్యారెంటీ లేకుండా, ఎవరికీ తెలియకుండా 9 నుండి 11.5 శాతం భారీ వడ్డీతో రూ. 3 లక్షల 15 వేల కోట్ల అప్పులను కేంద్రం మంజూరు చేసిందని విమర్శించారు.అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఐఆర్ఎఫ్‌సీ (IRFC) ద్వారా కేవలం 4 శాతం వడ్డీకే జపాన్ ఆర్థిక సంస్థ నుండి రూ. 13,600 కోట్ల రుణాన్ని తీసుకువచ్చేలా ఒప్పందం కుదుర్చుకుందని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1,400 కోట్లను కూడా చెల్లించిందని సీఎం వివరించారు. జపాన్ సంస్థ ఇప్పటికే నిధులను ఐఆర్ఎఫ్‌సీకి విడుదల చేసినప్పటికీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజకీయ కుట్రలతో ఆ నిధులను రాష్ట్రానికి బదిలీ కాకుండా అడ్డుకుంటున్నారని సీఎం సంచలన ఆరోపణ చేశారు. మే 20న కేంద్ర మంత్రి ఖట్టర్‌ను, మే 21న అశ్వినీ వైష్ణవ్‌ను కిషన్ రెడ్డి స్వయంగా కలిసి ఈ రుణాన్ని నిలిపివేయాలని కోరడం దారుణమన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×)ను ఒప్పించిన లేఖను సమర్పించినా లోన్ ట్రాన్స్‌ఫర్‌ను అడ్డుకున్నారని, దీనివల్ల వృథాగా పెరుగుతున్న వడ్డీ భారాన్ని కిషన్ రెడ్డే భరించాలని డిమాండ్ చేశారు.

### రాజకీయ వివక్షపై సీఎం సూటి ప్రశ్నలు

### కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ముఖ్యమంత్రి

### రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలను సంధించారు:


సికింద్రాబాద్ ఎంపీగా, తెలంగాణ ప్రతినిధిగా ఉండి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు దెబ్బతీస్తున్నారు? వరంగల్ విమానాశ్రయం పనుల వేగం పెరిగిన తరుణంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి ఆ పనులను ఎందుకు మందగించేలా చేశారు? కేసీఆర్ అడ్డగోలుగా మాట్లాడినా నోరు మెదపని కిషన్ రెడ్డి, తాము ప్రజా ప్రయోజనాల కోసం అడుగుతుంటే ఎందుకు సవాళ్లు విసురుతున్నారు? కిషన్ రెడ్డి వెనుక ఉండి కేటీఆర్ ఈ కుట్రలను నడిపిస్తున్నారా? అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, విశాఖపట్నం నగరాలకు మెట్రో నిధులను మంజూరు చేసిన కేంద్రం, తెలంగాణపై ఈ స్థాయి వివక్షను ఎందుకు ప్రదర్శిస్తోంది?

### తేల్చి చెప్పిన ముఖ్యమంత్రి..

"122 కిలోమీటర్ల మెట్రో రెండో దశ నిర్మాణంలో కేంద్రం భాగస్వామిగా ఉంటుందో లేదో స్పష్టం చేయాలి. మీకు కష్టంగా ఉంటే మీ 50 శాతం భాగస్వామ్యం మాకు అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిరభ్యంతర పత్రం (చీూజ) ఇస్తే, పూర్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి మెట్రో విస్తరణను పూర్తి చేసుకుంటుంది. రాజకీయాల కోసం నేను మాట్లాడటం లేదు.. మెట్రో మొదటి దశను పూర్తిగా స్వాధీనం చేసుకుని, రెండో దశను విజయవంతంగా పూర్తి చేయడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## భారత అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన అస్త్రం..

## లాంగ్ రేంజ్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష సక్సెస్



చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా క్షిపణి గమనాన్ని పర్యవేక్షించినట్లు పేర్కొంది. ఈ విజయంతో సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించే భారత సామర్థ్యం మరింత పెరిగినట్లయింది. రక్షణ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్‌తో పాటు భారత నౌకాదళం, వాయుసేనకు చెందిన ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ా=ూాజవీ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ బృందాన్ని, పరిశ్రమ భాగస్వాములను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. డీఆర్‌డీఓ ప్రయోగశాలలు, భారత పరిశ్రమ భాగస్వాములతో కలిసి ఈ క్షిపణిలోని అన్ని ఉపవ్యవస్థలను దేశీయంగానే అభివృద్ధి చేశాయి. బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ADE) నోడల్ లేబొరేటరీగా వ్యవహరించింది. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో కీలక ముందడుగు అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రెండు రోజుల క్రితమే డీఆర్‌డీఓ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (BMD), యాంటీ-షిప్ క్షిపణులను వరుసగా పరీక్షించిన విషయం తెలిసిందే.

## మంచిర్యాల ఎమ్మెల్యే గుండాగిరి బంద్ చెయ్

నష్టపోతోంది. కార్మికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ సంస్థను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారు. గుంటనక్క మాయలో కిషన్ రెడ్డి పడ్డాడు.. ఆయన లేఖ రాయగానే ఈయన ఆరా తీస్తుండు. మేము సింగరేణికి వెళ్తున్నామని తెలిసే గుంటనక్క అక్కడకు వచ్చింది. సింగరేణి హక్కులను కాపాడేది హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు.జీఎం చేసే పనులను సీఎం, క్లర్క్ చేసే పనులను డిప్యూటీ సీఎం చేస్తున్నారు. న్యాయం చేయగలిగే పరిస్థితుల్లో ఉండి ప్రతిపక్షాల మాదిరిగా కార్మికుల దగ్గరకు వస్తున్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తున్నాం.. రాష్ట్ర ప్రభుత్వం వాటికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి . కిషన్ రెడ్డి ఈ భూమి పుత్రుడైతే సింగరేణికి మేలు చేయాలని అన్నారు.

మంచిర్యాల నుంచే బొగ్గుబాయి యాత్ర ప్రారంభించుకోవటం ఆనందంగా ఉంది. తెలంగాణలో మేము ఒక ప్రాంతీయ పార్టీగా తెలంగాణ రక్షణ సేనను ప్రారంభించాం. రైతులు, సింగరేణి కార్మికులు ఇలా ఎన్నో అంశాలపై మాట్లాడుతున్నాం. ఇవ్వాళ సింగరేణిలో చాలా మంది కార్మికులను తగ్గించే కుట్ర చేస్తున్నారు. ఓపెన్ కాస్ట్ అంటూ కార్మికులను తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ అండర్ గ్రౌండ్ మైనింగ్ ద్వారా ఇంకా ఎక్కువ మైనింగ్ చేయవచ్చు. అదే విధంగా తెలంగాణ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించవచ్చు. కానీ సింగరేణిలో కార్మికులకు కనీసం సౌకర్యాలు కూడా కల్పించటం లేదు.

ఆఫీసర్లకు ఒక న్యాయం, కార్మికుడికి ఒక న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొంచెం లేట్ అయిన సరే అటెండెన్స్ వేయమంటూ వేధిస్తున్నారు. సింగరేణిలో ప్రతి శనివారం ఉద్యోగాల జాతర జరగాలి. కానీ ఇక్కడ ఎంత మంది సస్పెండ్ చేద్దామా అని లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వం అలసత్వం కారణంగానే ఈ పరిస్థితి వచ్చింది. సింగరేణికి ఇవ్వాల్సిన బకాయిలు అన్ని ఇచ్చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. డిప్యూటూ సీఎం భట్టి అంతా తన కనుసన్నల్లోనే జరగాలనే ప్రయత్నం చేస్తున్నారు. కార్మికుల హక్కులను హరిస్తూ వారిపై శాడిజం చూపిస్తున్నారు. సింగరేణి కార్మికులకు సరైన వసతులు కల్పిస్తే బంగారం పండిస్తారు. ప్రతి గని లో పరిస్థితిని మేము గమనించాం. కార్మికులకు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. కార్మికులతో వెట్టి చాకిరి చేయించటం సరికాదని ఆమె అన్నారు.

## పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

## అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని

ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు.
ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.మరో పోస్టులో ట్రంప్ ఈ ఒప్పందాన్ని చారిత్రక విజయంగా అభివర్ణించారు. "ఈ గొప్ప ఒప్పందం మొత్తం ప్రాంతానికి శాంతి, భద్రతను తెస్తుంది. గతంలో ఎందరో అధ్యక్షులు ఇరాన్‌తో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ప్రాంత నాయకులు, నిజమైన శాంతిని సాధించడంలో సహాయపడగల అధ్యక్షుడిని మొదటిసారి కనుగొన్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై శుక్రవారం అధికారికంగా సంతకాలు జరుగుతాయని, జలమార్గంలోని మైన్‌లను తొలగించే ప్రక్రియతో పాటే జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ తెలిపారు.అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. వైట్ హౌస్ నుంచి కూడా అధికారికంగా ఎలాంటి పత్రాలు విడుదల కాలేదు. ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన ఆంక్షల వంటి దీర్ఘకాలిక సమస్యలపై ట్రంప్ తన పోస్టులలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి మాత్రం హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల స్వేచ్ఛాయుత రవాణాను పునరుద్ధరించడమే ఈ ఒప్పందం తక్షణ లక్ష్యంగా కనిపిస్తోంది.

## బాల్య వివాహం బతుకు ఆగంపై రాష్ట్రవ్యాప్త పోరు

బాలికల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, ఆర్థిక స్వావలంబన దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. బాల్య వివాహం-బతుకు ఆగం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా కేంద్రంగా ఈ ప్రచారం మరింత విస్తృతంగా జరగాలన్నారు.తెలంగాణలో బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల నివారణకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఇప్పుడు తరుణి వంటి అనుభవజ్ఞ సంస్థ సహకారంతో ఈ ప్రయత్నాలను మరింత విస్తృత స్థాయిలో తీసుకెళ్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.ఈ ఒప్పందం ద్వారా అంగన్వాడీ సిబ్బంది, సూపర్వైజర్లు, సీడీపీవోలు, ఇతర శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచార కార్యక్రమాల ద్వారా బాల్య వివాహాల దుష్పరిణామాలు, మైనర్ గర్భధారణల ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, "ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకునే వాతావరణం కల్పించడం మనందరి బాధ్యత. బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయాలి" అని పిలుపునిచ్చారు.తరుణి స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ మమతా రఘువీర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి బాల్య వివాహాలు, మైనర్ గర్భధారణల తగ్గింపునకు సాంకేతిక సహకారం, అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో రౌండ్ టేబుల్

## సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎంట్రప్రెన్యూర్ అనే విధానాన్ని అనుసరిస్తున్నాం.భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నాం. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నాం. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇచ్చి భూములు కేటాయించాం. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయం. పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాను. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉంది. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉంది. అత్యుత్తమ ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని కోరుతున్నానని అన్నారు.

## 71 సార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా 'పెద్దన్న'ను

## ఒప్పించలేకపోయారు: రేవంత్ పై కేటీఆర్ ఫైర్

కేసు ఉచ్చు బిగుస్తోందన్న భయంతోనే రేవంత్ రెడ్డి బీజేపీతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే మెట్రో విస్తరణను నిరాకరిస్తున్న ప్రధానిని, కేంద్రాన్ని విమర్శించే ధైర్యం, దమ్ము ఆయనకు లేవని అన్నారు. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు వస్తే, ఈ అసమర్థ పాలనలో అన్నీ నిలిచిపోయాయని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.ఢిల్లీలో తనను 'చెప్పుల దొంగ'లా చూస్తున్నారని రేవంత్ రెడ్డే స్వయంగా చెప్పడం ఆయన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ అన్నారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును సాధించడంలో విఫలమైనందుకు సీఎం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 'మినీ ఇండియా' లాంటి హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం కావడం ఖాయమని హెచ్చరించారు.

## డీల్ కుదిరింది... అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

జలసంధి తెరుచుకుంటుంది చెప్పారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని సైన్యాన్ని ఆదేశించానని కూడా తెలిపారు. అమెరికా నావికా దళ దిగ్బంధనం కూడా తొలగిస్తున్నట్లు చెప్పారు. 'షిప్‌ల ఇంజన్లను స్టార్ట్ చేయండి, ఆయిల్ తరలించండి' అంటూ ఉత్సాహంగా పిలుపునిచ్చారు.

### "డీల్ కుదిరితే శత్రువును నమ్మినట్టు కాదు"

ఈ పరిణామాలపై ఇరాన్ కూడా స్పందించింది. అమెరికాతో అవగాహన ఒప్పందం కుదిరిందని ప్రకటించింది. యుద్ధం ముగించేందుకు ఒప్పందం కుదిరిందని తెలిపింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ శాఖ మంత్రి ఘరీబా బాదీ ఈ ప్రకటన చేశారు. ఈ నెల 19న స్విట్జర్లాండ్‌లో ఒప్పందంపై సంతకాలు చేస్తామన్నారు.

ఈ దిశగా దాదాపు 60 రోజుల పాటు చర్చలు జరిగాయని చెప్పారు. అయితే, డీల్ చేసుకున్నంత మాత్రాన శత్రువులను నమ్మినట్లు కాదని కూడా ఘరీబా బాదీ చెప్పారు. అమెరికా హామీలకు కట్టుబడి ఉంటుందో లేదో పరిశీలిస్తామని అన్నారు. ఈ ఒప్పందం నేపథ్యంలో లెబనాన్ సహా ఇతర ప్రాంతాల్లో మిలటరీ ఆపరేషన్స్ నిలిచిపోనున్నాయి.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి

చేశారు. ఒక్కసారిగా చెంపపై కొట్టడంతో దీప్కే ఆత్మరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. నీట్ పేపర్ లీక్, దేశంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి.

ఇందులో భాగంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం జరుగుతుండగానే అభిజీత్ దీప్కేపై ఈ దాడి జరిగింది. ఆందోళన చేస్తున్న అభిజీత్‌ను ఓ గుంపు అడ్డుకుని దాడికి పాల్పడింది. దాంతో, అభిజీత్ పై దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు చితకబాదారు.

కొందరు యువతను 'బొద్దింకలు' అంటూ సీజేఐ చేసిన ఓ వివాదాస్పద వ్యాఖ్యకు వ్యంగ్యాస్త్రంగా, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న 30 ఏళ్ల అభిజీత్ దీప్కే మే నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఉద్యమం యువతను ఆకట్టుకుని ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. గతంలో ఢిల్లీ, పుణె నగరాల్లో నిరసనలు చేపట్టిన ఈ బృందం, జైపూర్‌లోనూ ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో నిరసన తెలుపుతుండగా ఆయనపై దాడి జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## టార్గెట్ టూ థర్డ్...

2024 ఎన్నికల తరువాత మోదీ ప్రభుత్వం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి వచ్చింది. కానీ, గత రెండేళ్లుగా తన బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ చాలా చాలా ప్రయత్నాలు చేస్తున్నది. దీర్ఘకాలంగా తమతో ప్రయాణం చేస్తున్న కొన్ని పార్టీలు, పరిస్థితులను బట్టి మారే మరికొన్ని మిత్ర పక్షాలు, రాజకీయ అవసరాలు, అంశాలవారీగా మద్దతిచ్చే పక్షాలకు దగ్గరయ్యేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభలో ప్రస్తుతం బీజేపీకి 240 సీట్లు ఉన్నాయి.ఎన్డీయే మిత్రపక్షాలను కలిపినా 293 సీట్లతో సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నది. మూడింట రెండొంతుల మెజారిటీ కావాలంటే 362 సీట్లు అవసరం. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోతే ఏమవుతుందో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీకి అనుభవంలోకి వచ్చింది. దీంతో వివిధ పార్టీలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే 20 మంది టీఎంసీ ఎంపీలు లక్ష్యంగా ఆపరేషన్ లోటస్‌కు తెరదీసినట్టు తెలుస్తున్నది.వీరితో పాటు శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీతో జతకట్టే అవకాశం ఉంది. ఎందుకంటే, త్వరలో జరుగనున్న పంజాబ్ ఎన్నికల్లో అకాలీదళ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే, ఈ రెండు పార్టీల సభ్యులను కలుపుకొని ఎన్డీయే బలం 318కి చేరుతుంది. ఇక తమిళనాడులో డీఎంకేను తోసిరాజని టీవీకేతో కాంగ్రెస్ జతకట్టింది. డీఎంకే గతంలోనూ ఎన్డీయేతో కలిసి పనిచేసింది.ఇటీవల ఇండీ కూటమి సమావేశానికి కూడా డీఎంకే డుమ్మా కొట్టింది. ఈ క్రమంలో డీఎంకేను బీజేపీ సంప్రదించవచ్చు. ఇక వైఎస్సార్సీపీ. టీడీపీతో ఆ పార్టీకి రాజకీయ శత్రుత్వం ఎట్లా ఉన్నప్ప టికీ, మొదటినుంచీ బీజేపీతో సత్సం బంధాలు కొనసాగుతూనే ఉన్నా యి. ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఇటీ వలి కాలంలో బీజేపీకి అనుకూ లంగానే మాట్లాడుతున్నది. ఎన్నిక ల్లో ఓటమి తరువాతి పరిణామాల క్రమంలో బీజేడీ నేత నవీన్ పట్నాయక్ మళ్లీ బీజేపీ వైపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మొదటి నుంచి కూడా కీలకమైన బిల్లుల విషయంలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వస్తున్నది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగించవచ్చు.ఇక శరద్ పవార్‌కు బీజేపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. ప్రస్తుతానికి ఇండీ కూటమితో కలిసి ఉన్నప్పటికీ, కూతురు సుప్రియ రాజకీయ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది. పవార్‌ను బీజేపీ సంప్రదిస్తే, ఆ పార్టీకి ఉన్న 8 మంది బలం ఎన్డీయేకు చేకూరుతుంది. కాకపోతే, టీఎంసీతో పాటు, ఎన్సీపీని విలీనం చేయాలని సోనియాగాంధీ ఇప్పటికే ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఇందుకు ఆ పార్టీలు ఏ మేరకు అంగీకరిస్తాయనేది చూడాలి. శరద్ పవార్‌తో పాటు డీఎంకేను తనకు అనుకూలంగా మార్చుకోగలిగితే.. బయటి నుంచి కూడా ముఖ్య బిల్లుల విషయంలోనైనా మద్దతు ఇచ్చే పార్టీల బలాన్ని కలుపుకొంటే మోదీ ప్రభుత్వ బలం దాదాపు 355కి చేరుకుంటుంది. మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకా ఏడుగురు తక్కువవుతారు. ఇక రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ అంటే 163. బీజేపీ సొంత బలం 113, మిత్రపక్షాలను కలుపుకొంటే ఈ సంఖ్య 144కి చేరుతుంది. పది మంది టీఎంసీ సభ్యులను కలిపితే 154కి చేరుకుంటుంది. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్సీపీ 7, బీజేడీ 5, ముగ్గురు ఇండిపెండెంట్లను కలిపితే 169 అవుతుంది. దీంతో రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజారిటీ వచ్చినట్టే. ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.ముఖ్యమైన బిల్లులను పాస్ చేయించు కోవ డానికి ఈ సంఖ్య చాలా కీలకమవు తుంది. ఉమ్మడి పౌరస్మృతి, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు, ఒకే దేశం, ఒకే ఓటు వంటి బిల్లులను ఆమోదించుకోవడానికి బీజేపీకి ఇప్పుడు నంబర్ అవసరమవుతుంది. ము ఖ్యంగా లోక్‌సభలో మెజారిటీ కోసం బీజేపీ పెద్దలు చాలా జాగ్రత్తగా పావులు కదుపు తున్నారు.మరో వైపు ఈసీ కూడా భారత ఎన్నికల సంఘం కేంద్ర పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి జేబుసంస్థగా మారిందనే ఆరోపణలు, విమర్శలు అనేకం. స్వతం త్ర ప్రతిపత్తి గల ఈ రాజ్యాంగ సంస్థ పక్షపాతంతో అధికారంలో ఉన్న బీజేపీకి వంతపాడుతున్నదని ప్రజాసం ఘాలు, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి అనుకూలంగా లక్షల ఓట్లు తొలగించి విపక్షాల ఓటమికి కారణమైందనే ఆరోపణలు ఈ మధ్యకాలంలో మిన్నంటుతున్నాయి.సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి, ఎలక్షన్ల కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించి, కేంద్ర ప్రభుత్వం కొత్త గా తీసుకువచ్చిన చట్టం ఏకపక్షంగా ఉండటంతోనే ఎన్నికల కమిషన్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదనే విమర్శ కూడా ఉంది.

ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీచేసిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించింది.అయితే, ఈ క్రమంలో ఈసీ వ్యవహరించిన తీరు పై అనుమానాలు రాకమానదు. ఎన్నికలు నిస్సందేహం గా, నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల పవిత్రతను కాపాడాల్సిన అంతిమ బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉం టుంది. కానీ, కంచె చేను మేసిందన్నట్లుగా ఎన్నికల సం ఘం నిర్ణయం ఉన్నది. నిజంగానే అభ్యంతరాలు ఉంటే వివరణ కోరాల్సింది. అయితే, ఎన్నికల కమిషన్ అలా చేయలేదు. తెలంగాణలో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా, మీనాక్షికి సంబంధం లేని కేసులో వచ్చిన నోటీసులను సాకు చూపి నామినేషన్ తిరస్కరించడం సబబు కాదు. ఈ తతంగం వెనుక బీజేపీ ఉందనే ప్రచారం జరుగుతున్నది.మొన్నటికి మొన్న తమిళనాడులో గవర్నర్ అవలంబించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించింది.

అక్కడ ప్రజలు ఎన్నుకున్న అతిపెద్ద పార్టీని ప్రమాణస్వీకారానికి పిలువకుండా, రెండు రెండు ఆరు అన్నట్లుగా గవర్నర్ వ్యవహారశైలి ఉన్నది. బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించి తన సీటు గౌరవాన్ని తగ్గించారు. గవర్నర్‌కు సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం చాలా పరిమితమని తెలిసి కూడా కర్రపెత్తనానికి ఒడిగట్టారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గవర్నర్ల పాత్రను చాలా స్పష్టంగా వివరించారు.బ్రిటిష్ పార్లమెంటరీ విధానంలోని 'ది కింగ్ కెన్ డూ నో రాంగ్' అనే సూత్రం తెలిసినట్టుగా లేదు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చూసినా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రిగా మొదటి అవకాశం ఇవ్వాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1) ప్రకారం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఒక్క పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అతి పెద్ద పార్టీ నాయకుడిని ఆహ్వానించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుంది.అయితే, ఎమ్మెల్యేల సంతకాలు ముందే కావాలని గవర్నర్ పట్టుబట్టారు. ఇది ముమ్మాటికీ గతంలో ఎన్నడూ లేని కొత్త నిబంధనలను సృష్టించడమేనని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ తతంగాన్ని చూశాక గవర్నర్ వ్యవస్థ అనేది కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పావుగా మారిందని అందరికీ అర్థమైపోయింది. మెజారిటీ ఉందో, లేదో తేల్చాల్సింది లోక్‌భవన్ గదుల్లో కాదు కదా? ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి విజయ్ వద్ద మ్యాజిక్ ఫిగర్ లేదని సాకు చూపుతూ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించక, ప్రజా తీర్పును లోక్‌భవన్ అవమానించింది. అసెంబ్లీ వేదికగా మాత్రమే బలనిరూపణ జరగాలని సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో స్పష్టం చేసిన విషయాన్ని మరువరాదు.

# భారీ వర్షాలు కురిసినా... ట్రాఫిక్‌కు 'ధోకా' లేదు!

**- మల్కాజిగిరి పరిధిలోని 22 సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు మాక్ డ్రిల్**

**- రంగంలోకి ట్రాఫిక్, మున్సిపల్, విపత్తు నిర్వహణ బృందాలు**






మల్కాజిగిరి, జూన్ 15: భారత శక్తి, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ విభాగం ముందస్తు చర్యలు చేపట్టింది. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రధాన జలమయ ప్రాంతాల్లో (వాటర్ లాగింగ్ పాయింట్స్) వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించేందుకు సోమవారం ఒక సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ ఈ సంయుక్త మాక్ డ్రిల్‌ను స్వయంగా పరిశీలించి, సమీక్షించారు. ట్రాఫిక్ డీసీపీ వి. శ్రీనివాసులు, ఏసీపీల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

### - 11 స్టేషన్ల పరిధిలో... 22 సమస్యాత్మక ప్రాంతాలు

కమిషనరేట్ పరిధిలోని మొత్తం 11 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అత్యంత సమస్యాత్మకంగా గుర్తించిన 22 జలమయ ప్రాంతాలలో ఈ ఉమ్మడి ముందస్తు నిర్వహణ పరీక్షను చేపట్టారు. భారీ వర్షాల సమయంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పదును పెట్టడం, తద్వారా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజా రక్షణను నిర్ధారించడం ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశం.

### - రంగంలోకి విపత్తు నిర్వహణ, మున్సిపల్ బృందాలు

ఈ మాక్ డ్రిల్‌లో ట్రాఫిక్ పోలీసులతో పాటు శాంతిభద్రతల (లా అండ్ ఆర్డర్) సిబ్బంది, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి.ఆర్.ఎఫ్), మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం మరియు ఇతర కీలక శాఖల సిబ్బంది పాల్గొన్నారు. వీరంతా కలిసి క్షేత్రస్థాయిలో కింది అంశాలపై ఉమ్మడి చర్యలు చేపట్టారు:

- ట్రాఫిక్ మళ్లింపు:నీరు నిలిచే ప్రమాదకరమైన ప్రాంతాలలో ప్రత్యామ్నాయ మార్గాల (రూట్ల) ప్లానింగ్ అమలు.
- హెచ్చరిక బోర్డులు: వాహనదారులను అప్రమత్తం చేసేందుకు బారికేడ్లు, సైనేజ్ బోర్డుల ఏర్పాటు.
- లైవ్ కోఆర్డినేషన్: కంట్రోల్ రూమ్‌లకు, క్షేత్రస్థాయి అధికారులకు మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ పనితీరును పరీక్షించడం.
- అత్యవసర సహాయం: నీటిలో చిక్కుకుపోయే వాహనాలు, ప్రయాణికులను సురక్షితంగా వెలికితీసేలా రెస్పాన్స్ టైమ్‌ను అసెస్ చేయడం.

### - పోలీసులకు సహకరించండి: కమిషనరేట్ విజ్ఞప్తి

వర్షాకాలంలో రోడ్లపై తలెత్తే అత్యవసర పరిస్థితుల్లో వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని మల్కాజిగిరి కమిషనరేట్ అధికారులు విజ్ఞప్తి చేశారు. పోలీసులు సమయానుకూలంగా జారీ చేసే ట్రాఫిక్ అడ్వైజరీలను (సూచనలను) గమనిస్తూ ప్రయాణాలు సాగించాలని కోరారు.

## నిర్దేశించిన గడువు లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి..

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



పటాన్‌చెరు జూన్ 15 భారత శక్తి అమీన్‌పూర్, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో అమీన్‌పూర్, పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు సర్కిళ్ల పరిధిలోని 9 డివిజన్ల లో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రధానంగా నూతన కాలనీలలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున.. పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంతోపాటు ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొల్లారం స్టేడియం, పాటి వివేకానంద స్టేడియంల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రెండు సర్కిళ్ల కు సంబంధించిన 250 కోట్ల నిధులు తిరిగి డివిజన్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కేటాయించాలని ఇప్పటికే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కు విన్నవించడం జరిగిందని తెలిపారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రదీప్ కుమార్, జ్యోతి రెడ్డి, డిఈ వెంకటరమణ, ఏఈ లు ఫైజాన్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 18న వనమహోత్సవం

**- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన టీజీ ఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**



ఎల్బీనగర్, జూన్ 15 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం--2026 కార్యక్రమం ఈ నెల 18న ఘనంగా ప్రారంభం కానుంది.బీఎన్ రెడ్డి నగర్, సాగర్ రోడ్డులో ఉన్న గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ పార్క్ లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించేందుకు టీజీఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి అర్బన్ ఫారెస్ట్ పార్కును సందర్శించారు. కార్యక్రమ నిర్వహణ, మొక్కలను నాటే ప్రదేశాలు, వేదిక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా డిఎఫ్ఓ రోహిత్ రెడ్డి ఐఎఫ్ఎస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నవీన్ రెడ్డి, వనస్థలిపురం సర్కిల్ ఇన్స్ పెక్టర్ రవిబాబు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు.వనమహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయాలని, ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం ద్వారా పచ్చని తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, నాయకులు మెరుగు రమేష్ రెడ్డి, వినయ్ పటేల్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



భారత శక్తి VOICE OF INDIAN



# జయవరం వద్ద రోడ్డు ప్రమాదం.. రేకుర్తి యువకుడు అక్కడికక్కడే మృతి



భారత శక్తి న్యూస్, వేములవాడ, జూన్ 15: వేములవాడ పట్టణ శివారులోని జయవరం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కరీంనగర్ సమీపంలోని రేకుర్తి గ్రామానికి చెందిన దానే రమేశ్ (30) తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం వేములవాడ శివారులోని జయవరం వద్ద అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రమేశ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

## - 145 గ్రాముల గంజాయి,సెల్‌ఫోన్ స్వాధీనం




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద నమ్మదగిన సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి,అతని వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఆదివారం మధ్యాహ్నం అందిన నమ్మదగిన సమాచారం మేరకు జైపూర్ సీఐ నవీన్ ఆదేశాల ప్రకారం, జైపూర్ ఎస్ఐ భూమేష్ తన సిబ్బందితో కలిసి ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులను గమనించిన ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించగా అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో అతడు షేక్ ఆఫ్రీద్ (23), ఎస్‌టీకాలనీ,జైపూర్ నివాసిగా గుర్తించారు. నిందితుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నానని,అధిక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, జైపూర్ పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నానని ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద ఉన్న బ్యాగును పంచుల సమక్షంలో తనిఖీ చేయగా,ఒక ప్యాకెట్‌లో ఎండబెట్టిన గంజాయి లభించింది.తూకం వేయగా 145 గ్రాముల గంజాయి ఉన్నట్లు నిర్ధారణ అయింది. అలాగే గంజాయి కొనుగోలు, విక్రయాలకు ఉపయోగిస్తున్నట్లు తెలిపిన రియల్‌మీ 6 ప్రో మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.3,500గా అంచనా వేశారు. గంజాయి ప్యాకెట్, పాలిథీన్ కవర్, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు.అనంతరం నిందితుడిని,స్వాధీనం చేసుకున్న ఆస్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ భూమేష్ పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# గంభీరావుపేట బస్టాండ్, మార్కెట్ ప్రాంతంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 14:గంభీరావుపేట బస్టాండ్, మార్కెట్ ప్రాంతంలో గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. పలు పాన్ షాపులు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వస్తువుల కోసం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

# సాయి మాధవి హోటల్ లో అగ్ని ప్రమాదం




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 ( భారత శక్తి ) : మంచిర్యాల పట్టణంలోని సాయి మాధవి హోటల్ లో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనలో సుమారు 40 లక్షల విలువ మేర ఆస్తి నష్టం జరిగినట్లు హోటల్ నిర్వాహకులు తెలిపారు.రాత్రి సుమారు 2 గంటల సమయంలో హోటల్‌లో మంటలు చెలరేగినట్లు నిర్వాహకులు టేకులు సంతోష్ తెలిపారు.మంటలు వేగంగా వ్యాపించడంతో హోటల్‌లోని విలువైన సామగ్రి, వస్తువులు కాలిపోయాయి.అదృష్టవశాత్తూ ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని,మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు.సుమారు గంటన్నర పాటు అవిశ్రాంతంగా పోరాడి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు.

# మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: వేసవి సెలవుల అనంతరం మళ్లీ బడి బాట పట్టిన విద్యార్థులందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. "పాఠశాల అనేది కేవలం చదువులు నేర్చుకునే స్థలం మాత్రమే కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఆలయం. ప్రతి పుస్తకం ఒక కొత్త ప్రపంచానికి తలుపు లాంటిది. ప్రతి పాఠం ఒక కొత్త అవకాశానికి మార్గం. విద్య మన భవిష్యత్తుకు వెలుగు నింపే శక్తి. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని విశ్వసిస్తాను. అందుకే అత్యున్నత ప్రమాణాలతో విద్యారంగం విలసిల్లాలని అనేక సంస్కరణలు చేపట్టాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పోషకాలతో కూడిన ఆహారం అందించడమే కాకుండా అనేక చర్యలు చేపట్టాం.

ప్రతి రోజును ఉత్సాహంతో ప్రారంభించి, గురువుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించండి. కష్టపడి చదవండి. మంచి విలువలను అలవర్చుకోండి. మీ కలలను నిజం చేసుకునేందుకు నిరంతరం శ్రమించండి. నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలు. మీలోని ప్రతిభను వెలికితీసి, కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలి. "విద్యే గొప్ప సంపద -- దానిని ఎవరూ దోచుకోలేరు. విద్యతోనే విజయం, విద్యతోనే వికాసం." ఈ విద్యా సంవత్సరం మీ అందరికీ జ్ఞానం, ఆనందం, విజయాలను అందించాలని ఆకాంక్షిస్తూ... అందరికీ శుభారంభం -- ఆనందంగా బడికి వెళ్లండి, ఆసక్తిగా నేర్చుకోండి, ఉన్నత లక్ష్యాలను సాధించండి" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడులతోనే ఉజ్వల భవిష్యత్తు: కలెక్టర్ రాజర్షి షా.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 15 (భారత శక్తి): ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలను పెంచేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సదుపాయాలు వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రతి గ్రామం, పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేయాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను సత్కరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి ): హోంగార్డ్ ఆర్గనైజేషన్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి నేడు పదవీ విరమణ పొందిన ఇందాల్ సింగ్ హోంగార్డును ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఘనంగా సత్కరించారు. 37 సంవత్సరాలు హోంగార్డ్ ఆర్గనైజేషన్ లో సేవలను అందించి ఈరోజు పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను జిల్లా ఎస్పీ శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అనంతరం అశేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.దైనందిన కార్యక్రమాలలో భాగంగా వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, ఏ.ఓ యూనస్ అలీ, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్ పాల్గొన్నారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

## -సోమవారం ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక.



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 15: ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 205 వచ్చాయి. ఐడీఓసీ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్ మండలం చాత గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం

## "ప్రతి గ్రామం - ప్రతి పౌరుడు...నేర నివారణలో భాగస్వామి కావాలి" - పోలీసులు.





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(భారత శక్తి )ఎస్పీ డా.జి.జానకి షర్మిల దిశానిర్దేశాల మేరకు ఈరోజు భైంసా సబ్ డివిజన్ లోని కుబీర్ మండలం చాత గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న (92) ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడమైనది. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు,నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణనిచ్చారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, భైంసా రూరల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్ఐ కృష్ణ రెడ్డి, కుంటాల ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బడిబాట-2026కు ఘన ఆరంభం.. విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట-2026 కార్యక్రమంలో భాగంగా పాఠశాలల పునఃప్రారంభ దినోత్సవాన్ని నిర్మల్ రూరల్ మండలంలోని రత్నపూర్ కాండ్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు.పాఠశాలకు వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించిన డీఈఓ, అనంతరం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి బాలబాలిక పాఠశాలలో చేరి విద్యను అభ్యసించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవ కార్యక్రమం




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: ఈరోజు హైదరాబాద్‌లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో శాసనమండలి సభ్యులు, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొ.కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొ.కోదండరాం మాట్లాడుతూ వయోవృద్ధులపై జరుగుతున్న వేధింపులను అరికట్టడం, వారి హక్కులను పరిరక్షించడం, సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధులు కుటుంబానికి, సమాజానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవాలు భావితరాలకు ఉపయోగపడే సంపద అని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, భద్రత, ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం మరియు సమాజం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# దోనూరులో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమం



జగిత్యాల, జూన్ 15 (భారత శక్తి ప్రతినిధి): జైన సెక్టార్ పరిధిలోని దోనూరు సెంటర్‌లో సోమవారం "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణ చర్యల గురించి వివరించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొని అంగన్‌వాడీ సేవలపై అవగాహన పొందారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 24 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల, జూన్ 15(భారత శక్తి ): ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 24 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఘనంగా 130వ డివిజన్ ఉపాధ్యక్షులు దొడ్ల నాగేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



కుత్బుల్లాపూర్, జూన్ 15(భారత శక్తి ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130వ డివిజన్ ఉపాధ్యక్షులు దొడ్ల నాగేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు . ఈ సందర్భంగా హన్మంతన్న దొడ్ల నాగేశ్వర్ రెడ్డి ని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ప్రజాసేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, డీసీసీ కార్యనిర్వాహక సభ్యులు కరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరికిరణ్ పటేల్, నరసింహ గౌడ్, రామచందర్, చందు, రాజు చారి, ఎండి గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమంలో మంత్రి పాత్ర కీలకం

**: మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ జక్కు రవీందర్**

జగిత్యాల, జూన్ 15 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న స్వీపర్లు, డైలీ వేజ్, కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగుల వేతనాల పెంపునకు కృషి చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ జక్కు రవీందర్ ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానంలో పనిచేస్తున్న స్వీపర్ల వేతనాలను రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు పెంచడంతో పాటు ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, అర్చకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు తదితర సిబ్బంది వేతనాలను రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు పెంచడం జరిగిందని తెలిపారు. అలాగే బోయవారి పారితోషికాలను పెంచడంతో పాటు మిగిలిన స్వీపర్లు, నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కూడా హామీ లభించిందన్నారు. 2027 పుష్కరాల నేపథ్యంలో దేవాలయ అభివృద్ధి, పుష్కర ఘాట్లు, రహదారుల నిర్మాణం కోసం రూ.117 కోట్ల నిధులు మంజూరు చేయించారని, అదనంగా మరో రూ.50 కోట్ల నిధుల కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దేవస్థాన ఉద్యోగులు, సేవకుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ జక్కు రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే

# సింగరేణి సంస్థ నష్టపోతోంది

**- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల**

**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి):తెలంగాణనే కొట్లాడి తెచ్చుకున్నాం మంచిర్యాల ఎమ్మెల్యే గుండా గిరికి భయపడతమా అని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.బాయ్ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఈ గడ్డ నుంచి తెలంగాణ రక్షణ పార్టీ ఏర్పాటయిందని ఇక్కడి నుంచే జెండా ఎగరవేస్తామని కవిత తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గుండాగిరి బంద్ చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి కారణంగానే సింగరేణి సంస్థ నష్టపోతుందని, సింగరేణి హక్కులను కాపాడేది హెచ్ఎంఎస్ టిఆర్ఎస్ మాత్రమే అని అన్నారు.సింగరేణి బొగ్గు మాయం వెనక ఉన్న నిజాలను తేల్చేందుకు ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. జిఎం చేసే పనులు, సీఎం క్లర్క్ చేసే పనులను డిప్యూటీ సీఎం చేస్తున్నారూ అని అన్నారు.కార్మికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతూ సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతుందని, కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కార్డులను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం వాటికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ భూమి పుత్రుడు అయితే సింగరేణికి మేలు చేయాలన్నారు.మంచిర్యాల నుంచి బొగ్గు భాయ్ యాత్ర ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు.తెలంగాణలో మేము ఒక ప్రాంతీయ పార్టీగా రక్షణ సేనను ప్రారంభించామన్నారు. సింగరేణిలో చాలామంది కార్మికులను తగ్గించే కుట్ర చేస్తున్నారన్నారు.సింగరేణిలో కార్మికుల కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గుజరాత్ లోని గుజరాత్ మినరల్స్ అనే కార్పొరేషన్ ఉంది. మైనింగ్ మెంబర్స్ అన్ని దాని ద్వారా నడుస్తున్నాయన్నారు. ఈ విధానాన్ని కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేయాలన్నారు .మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గుజరాత్ మాదిరిగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు.సింగరేణి మైనింగ్ డెవలప్మెంట్ విధానాన్ని తెస్తే అండర్ గ్రౌండ్ మైనింగ్ కూడా చేసుకోవచ్చని తెలిపారు.బొగ్గ కుంభకోణాన్ని సాకుగా చూపి అధికారంలోకి వచ్చాక 250 బ్లాకు ను జాతీయం చేసిందన్నారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల అని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నాలుగు లేబర్ కోట్ల చట్టాలను మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు . మంచిర్యాల ఎమ్మెల్యే సింగరేణిలో చేస్తున్న అవినీతిని త్వరలో బయటపెడతామని అన్నారు. కాంటాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని పెద్దపెల్లి ఎంపి ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సింగరేణి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కార్మికులకు ఎలాంటి న్యాయం చేయలేదని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

# ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి మంత్రి అడ్లూరి

**బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి**



జగిత్యాల, జూన్ 15 (భారత శక్తి ప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితాల నుంచి ఓట్లను తొలగించి అధికారంలోకి రావడానికి కుట్రలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురిలో సోమవారం నిర్వహించిన బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ బూతులు, 2.37 లక్షల మంది ఓటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు.

ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లు పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేస్తున్న ఆరోపణలను ఖండించిన మంత్రి, వడ్ల కొనుగోలు లేదా ఇసుక రవాణాలో తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రుద్ర సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఓటును కాపాడాల్సిన బాధ్యత బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లపై ఉందన్నారు. ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాకాల సీజన్‌లో అధికారులు, యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: వర్షాకాల సీజన్‌లో అధికారులు, యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులు, తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా జూన్ 1వ తేదీన సమీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జూన్ 9న నగరంలో వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్ లను ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. వర్షం కురిసిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్‌స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. సీజన్‌లో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్, పంపిణీ కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీని ఆదేశించారు.

# 17న లబ్ధిదారుల ధృవపత్రాల పరిశీలన

**- ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి వెల్లడి,**

ఆదిభట్ల: జూన్ 15 భారతశక్తి, ఆదిభట్ల సర్కిల్-15 (ఆదిభట్ల, తుర్కయంజాల్) పరిధిలో ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధృవపత్రాల పరిశీలన ఈ నెల 17న (బుధవారం) నిర్వహించనున్నారు. రాగన్నగూడలో ఉదయం 11 గంటలకు ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్, ఆదిభట్ల సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

**- తీసుకెళ్లాల్సిన పత్రాలు:**

ఎస్సీ కార్పొరేషన్ కింద ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, అలాగే మైనారిటీ కార్పొరేషన్ కింద ద్విచక్ర వాహనాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ క్రింది ఒరిజినల్ పత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

- ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం (Original Application Form)
- ఆధార్ కార్డు
- కుల ధృవీకరణ పత్రం (Caste Certificate)
- ఆదాయ ధృవీకరణ పత్రం (Income Certificate)
- బ్యాంకు పాస్‌బుక్
- డ్రైవింగ్ లైసెన్స్ (వర్తించే వారు మాత్రమే)

అర్హులైన లబ్ధిదారులందరూ నిర్ణీత సమయానికి హాజరై ధృవపత్రాల పరిశీలనను పూర్తి చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

# ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

**- అభ్యంతరాల స్వీకరణకు నేడు సాయంత్రం 4 గంటల వరకు గడువు: జిల్లా విద్యాధికారి బి. భోజన్న**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్న 74 ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. ఈ జాబితాను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించడంతో పాటు, జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.తాత్కాలిక మెరిట్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు తమ రుజువులతో కూడిన రాతపూర్వక వినతులను రేపు సాయంత్రం 4 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. నిర్దేశిత గడువు అనంతరం వచ్చే అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. అభ్యంతరాల పరిశీలన పూర్తయిన అనంతరం తుది మెరిట్ జాబితాను ప్రకటించి, తదుపరి నియామక ప్రక్రియను చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెల్లడించారు.

# అల్వాల్‌లో విషాదం

## కరెంట్ షాక్‌తో తండ్రి, కూతురు మృతి



జనగామ(భారత శక్తి )జూన్ 15: మేడ్చల్ జిల్లా అల్వాల్ టెలికాం కాలనీలో దారుణ ఘటన జరిగింది.వర్షానికి విద్యుత్ వైర్లపై చెట్టు పడిపోవడంతో సమీపంలో ఉన్నకారును తరలించేందుకు వెళ్లిన తండ్రి,కూతురికి కరెంట్ షాక్ తగిలింది. ఘటనలో సందీప్ (45),రితిక (16) అక్కడికక్కడే మృతి చెందారు .ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సీఎం రేవంత్ ఆ హామీలు తీరిస్తే రాజకీయం వదిలేస్తా:కేటీఆర్



జనగామ(భారత శక్తి)జూన్ 15: రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి రెండున్నరేళ్లయినా ఒక్క పని పూర్తి చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఖైరతాబాద్‌లో ఎస్ఐఆర్ పై నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం గరీబోళ్ల పొట్ట కొట్టిందని, హైడ్రా పేరుతో వందల ఇళ్లను కూలగొట్టి కుటుంబాలను రోడ్డున పడేశారని, ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం బాకీలతో సహా లక్షన్నర రూపాయలు ఇస్తే,రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

# వాసవీయుల సేవా హస్తం

## - అమావాస్య మహా అన్నదానం

**- వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం**





మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మంచిర్యాల ఐబి చౌరస్తాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత మహాజన్ రూపాలి రఘునందన్ దంపతుల సహకారంతో ప్రతినెల నిర్వహించే అమావాస్య అన్నదానంలో భాగంగా దాదాపు 500 పైగా నిరుపేదలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, జోన్ చైర్ పర్సన్ లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్ల సూర్యనారాయణ,వాసవి క్లబ్ కార్యదర్శి గుండా మనోహర్,నస్పూర్ మండల్ వాసవి క్లబ్ కార్యదర్శి తోట రాజయ్య, కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**- వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం**

పట్టణము లోని విశ్వనాథ స్వామి దేవాలయంలో ప్రతినెల అమావాస్య రోజున వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. దీంట్లో భాగంగా సోమవారం రోజున అప్పాల యశోద జ్ఞాపకార్ధశీ కుమారులు కూతుళ్లు అప్పాల లాచయ్య,అప్పాల నాగరాజు - స్వప్న,రవి కుమార్ - రమ్య,సంతోష్ - హారిక, సిరిపురం రజిత -శ్రీనివాస్, ఉత్తురి ధనలక్ష్మి- శ్రీనివాస్,నగిరి కవిత - నరేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ పడకంటి శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ మధు శ్రీ, జోన్ చైర్ పర్సన్ పాత సాయి,వాసవి క్లబ్ యూత్ అధ్యక్షుడు ముక్త విశ్వాస్, కార్యదర్శి బోనగిరి ప్రసన్నకుమార్, కోశాధికారి గందె శ్రీ అనిల్ కుమార్, రీజియన్ సెక్రటరీ తాటిపల్లి సాయివర్ధన్, క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ కాచం సతీష్ , వాసవి యూత్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శి,కోశాధికారి ,యూత్ క్లబ్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# పార్టీ కోసం కష్టపడి పని చేసేటోళ్లకే పదవులు.!

**-సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్**

**-ప్రజాపాలన ప్రభుత్వం వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలి.**

**-బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై విస్తృతస్థాయి సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ తకెళ్లపల్లి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగెల రాజేంద్రర్, మాజీ ఎమ్మెల్యే రేగా**





మణుగూరు, జూన్ 15 (భారతశక్తి): భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ కోసం పనిచేసేటోళ్లకే పదవులు వరిస్తాయని ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి (డిజిటల్) మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగెల రాజేంద్రర్, మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హనుమాన్ ఫక్షన్ హాల్లో పినపాక నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ పై విస్తృతస్థాయి సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జి (డిజిటల్) దిండిగెల రాజేంద్రర్ పాల్గొని ప్రసంగించారు. పినపాక నియోజకవర్గానికి రేగా కాంతారావు రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వనన్ని నిధులు పినపాక నియోజకవర్గానికి తీసుకు వచ్చారని ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, దిండిగెల రాజేంద్రర్ లు అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు కష్టాలే మిగిలాయని, గులాబీ శ్రేణులు ప్రజాపాలన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, బిఆర్ఎస్ హయాంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్ధమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల అభివృద్ధి చెందిందని రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్లతో పాటు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరగడంతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారని కొనియాడారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను నమ్మించి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని, కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. అవినీతి కాంగ్రెస్ ను గద్దెదించే వరకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని పినపాక నియోజకవర్గంలో ప్రతి ఒక కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని, ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. బిఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీనిని అనుకూలంగా మార్చుకొని ఆ దిశగా కలిసికట్టుగా పక్క ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కెసిఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసేవరకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ మండల నాయకులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బి.ఎన్.రెడ్డి నగర్‌లో 'కేబీఆర్' తరహా భారీ పార్క్!

**- 116 ఎకరాల్లో పచ్చని వనం.. రూ.20 కోట్లతో డ్రైనేజీ సమస్యలకు చెక్: మధుయాష్కి గౌడ్ వెల్లడి.**

**- జూన్ 18న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 'వన మహోత్సవం'.. అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన**





ఎల్బీనగర్, జూన్ 15: భారత శక్తి నగరంలోని ప్రముఖ కేబీఆర్ పార్కు తరహాలోనే బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంతంలో 116 ఎకరాల విస్తీర్ణంలో ప్రజల కోసం ఒక అద్భుతమైన, ఆహ్లాదకరమైన పార్కు అందుబాటులోకి రాబోతోంది. జూన్ 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతంలో 'వన మహోత్సవ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అధికారులతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో అడవుల ముఖ్య సంరక్షణాధికారి (సీసీఎఫ్) ప్రియాంక వర్గీస్, జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) రోహిత్ రెడ్డి, సహాయ పోలీస్ కమిషనర్ (ఏసీపీ) కాశీ రెడ్డి తదితరులు పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రత, సభా ఏర్పాట్లపై సమీక్షించారు.

**- 30 ఏళ్ల భూవివాదానికి తెర.. ప్రజా ప్రభుత్వానిదే ఘనత!**

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 116 ఎకరాల సువిశాల అటవీ ప్రాంతంలో ఆధునిక పార్కు అందుబాటులోకి రావడం గొప్ప అవకాశమన్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా (30 ఏళ్లుగా) నలుగుతున్న స్థల వివాదాన్ని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి, ఈ భూమిని ప్రజల ఆస్తిగా మారుస్తోందని స్పష్టం చేశారు.

**- మౌలిక వసతుల కల్పన.. రూ. 20 కోట్లతో బాక్స్ డ్రైన్ల నిర్మాణం**

కేవలం పార్కు అభివృద్ధి మాత్రమే కాకుండా, బి.ఎన్.రెడ్డి నగర్ మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని మధుయాష్కి తెలిపారు.

- వర్షపు నీరు నిలవకుండా, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి "రూ. 20 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్ (పెద్ద మూసివున్న డ్రైనేజీ కాలువ)" మరియు కొత్త డ్రైనేజీ లైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.
- గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, హైదరాబాద్ నగరానికి చెందాల్సిన నిధులన్నింటినీ కాళేశ్వరం ప్రాజెక్టుకు తరలించిందని ఆయన విమర్శించారు.
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నగర నిధులను ఇక్కడి ప్రజల కోసమే ఖర్చు చేస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందని పేర్కొన్నారు.

**- వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి**

జూన్ 18న జరిగే సీఎం రేవంత్ రెడ్డి 'వన మహోత్సవం' కార్యక్రమానికి పరిసర కాలనీల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మధుయాష్కి పిలుపునిచ్చారు.

**- కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:**

ఈ ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు శ్రీనివాస్, బాబ్జీరావ్, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావులతో పాటు స్థానిక నాయకులు పర్వతి గణేష్ రెడ్డి, రఘుమారెడ్డి, భీమిలి రామకృష్ణారెడ్డి, కళ్లెం సుజాతా రెడ్డి, రజిని రావు, రాజేశ్వరి, వసంత, భాను, వినయ్ పటేల్, చంద్రకాంత్ గౌడ్, దాము మహేందర్ యాదవ్, శ్రీనాథ్, బద్రీనాథ్, ఆల వెంకటరెడ్డి, షేక్ షాకీర్, ప్రవీణ్ రెడ్డి, సూర్యనారాయణ, చిరంజీవి గౌడ్, విజయ భాస్కర్ రెడ్డి, రేణు గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, మనీష్ గౌడ్, సుధాకర్ గౌడ్, నంద కిషోర్, ప్రశాంత్ గౌడ్, భవాని, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యారోగ్య రంగ కార్మిక నేతకు కీలక బాధ్యతలు

**- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గిరి యాదయ్య నియామకం**

హైదరాబాద్ జూన్ 15 భారతశక్తి, తెలంగాణ యునైటెడ్ వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం (మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య నియమితులయ్యారు. వైద్యారోగ్య రంగంలో సుదీర్ఘ కాలంగా ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగిస్తూ సంఘం కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుంది.

**"సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం: గిరి యాదయ్య**

ఈ నియామకంపై గిరి యాదయ్య స్పందిస్తూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో, సక్రమంగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని భరోసా ఇచ్చారు.

"వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో పాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నా వంతు శాయశక్తులా కృషి చేస్తాను."

**- గిరి యాదయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి**

**- కేంద్ర కమిటీకి కృతజ్ఞతలు**






సంఘం బలోపేతానికి మరియు ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని ప్రకటించిన గిరి యాదయ్య, ఈ నియామకానికి సహకరించిన సంఘం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎంపికకు మద్దతుగా నిలిచిన సంఘం గౌరవ అధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర అధ్యక్షుడు ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యదా నాయక్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన నియామకం పట్ల రాష్ట్రంలోని పలువురు వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

# ఏ.పీ. ఎయిమ్స్ యాప్ ద్వారా
# ఎరువులు పంపిణీపై రైతుల ఆందోళన

- తక్షణం నిలిపివేయాలి. - రైతాంగానికి అవసరమైన అన్ని రకాల ఎరువులను, విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి.
- యూరియా మోతాదును రైతాంగం పండించే విస్తీర్ణం ఆధారంగా అందించాలి.
- వై.యస్. జగన్ సర్కార్ లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందించింది.
- రైతాంగాన్ని ఆదుకోని నారావారి సర్కార్ - వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం ఫైర్




**కడప (భారత శక్తి)** ఏ.పీ.ఎయిమ్స్ యాప్ ద్వారా రైతాంగానికి సరిపడా ఎరువులను వైయస్సార్ కడప జిల్లాలో పంపిణీ చేయకపోవడంతో రైతాంగంలో ఆందోళన, ఆగ్రహం పెల్లుబుక్కుతోందని... తక్షణం యాప్ ను నిలిపివేసి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ప్రకారం ఎరువులను పంపిణీ చేయాలని లేకుంటే రైతాంగ ఆగ్రహానికి గురికాక తప్పదని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా రైతు పోరాట సమితి మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కడప నగరంలోని వైయస్సార్ సిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ కు సంబంధించి అవసరమైన మేరకు యూరియా, డిఏపి, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయలేక చేతులెత్తేసిందని ఆయన ఎద్దేవా చేశారు. వరి పంటకు సంబంధించి ఒక ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాలు ఎరువులు అవసరం కాగా ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కేవలం ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తుండడంతో రైతాంగానికి సరిపడక ఆందోళన వ్యక్తపరుస్తోందని తక్షణం ఆ పథకాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాస్త్రవేత్తలు సిఫారసు మేరకు ఒక ఎకరాకు 100 నుంచి 110 కేజీల యూరియాను అధిక దిగుబడుల కొరకు తప్పనిసరిగా వాడాలని కఠినమైన నిబంధనలు ఉండగా,ప్రస్తుత నూతన విధానం ద్వారా కేవలం 60 నుంచి 70 కేజీలు మాత్రమే వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విరుచుకుపడ్డారు. ఒకవైపు పెరుగుతున్న జనాభాకు ఆహార ఉత్పత్తులను సరఫరా చేయాలంటే రైతులు పండించే పంటలో అధిక దిగుబడులు సాధించాల్సి అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం ఏమిటని? ఆయన నిలదీశారు. రైతులకు కావాల్సిన ఎరువుల మోతాదును చంద్రబాబు సర్కార్ తగ్గించడం, సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచకపోవడంతో గణనీయంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. ఎరువులు బ్లాక్ మార్కెట్ కు తరలించి అమ్మకాలు కొనసాగిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ఎరువులు, నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీ రేట్లకే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో రైతాంగం ఉద్యమాలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. వై.యస్. జగన్ సర్కార్ లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా, ఎమ్మార్పీ ధరలకే ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసి మన్ననలను పొందిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చంద్రబాబు సర్కార్ లో పారదర్శకత కొరబడడంతో ఎమ్మార్పీ ధరలకు ఎరువులు అందడం లేదని, కావాల్సిన మేరకు ఎరువులు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50,000 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరం కాక కేవలం 15,000 మెట్రిక్ టన్నుల ఎరువులే అందుబాటులో ఉన్నాయని ఇది రైతాంగాన్ని ముంచడం, వంచించడం కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎరువుల పంపిణీలో నూతన విధానం ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా మాన్యువల్ గా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంటల విస్తీర్ణాన్ని బట్టి శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ఎరువులు ముఖ్యంగా యూరియా, డి ఏ పి మోతాదును తప్పనిసరిగా రైతులకు అందుబాటులో ఉంచాలని లేకుంటే ఘననీయంగా దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తపరిచారు.

వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ జెడిఏ తక్షణం జోక్యం చేసుకొని ప్రభుత్వ దృష్టికి తెచ్చి రైతాంగానికి కావలసినంత మేర ఎరువులను తెప్పించి సాగు విస్తీర్ణం తగ్గకుండా అధిక దిగుబడులు సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతాంగం పక్షాన రెడ్యం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్.సి విభాగం అధ్యక్షుడు సింగనమల వెంకటేశ్వర్లు, వైయస్సార్ సిపి జిల్లా విద్యార్థి భాగం ప్రధాన కార్యదర్శి పితాంబరి మహేశ్వరరెడ్డి, వైయస్సార్ సిపి బిసి నేత మునెల్లి వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీలో ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ కోర్సు ప్రారంభం..

- కేపీఎంజీ ఇండియాతో భాగస్వామ్యం

**హైదరాబాద్ (భారత శక్తి)** గాయత్రి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రముఖ విద్యాసంస్థ అనురాగ్ యూనివర్సిటీ.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (ఃఈూఎ) రంగంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఓఃం) కోర్సును ఇవాళ ప్రకటించింది. ఈ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన కొన్ని ప్రత్యేక సబ్జెక్టులను బోధించడానికి, అలాగే విద్యార్థులకు ఇండస్ట్రీ నాలెడ్జ్ అందించడానికి ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కేపీఎంజీ (ఐఖఓఉ తిని ఎనిటతిజీ) సాంకేతిక సహాయాన్ని అందించనుంది. ఈ టూ-ఇయర్ ఫుల్-టైమ్ ప్రోగ్రామ్ పూర్తి డిజైన్, నిర్వహణ, విద్యార్థుల అసెస్మెంట్ (మూల్యాంకనం) బాధ్యతలను అనురాగ్ యూనివర్సిటీ చూసుకుంటుంది.

హైదరాబాద్ క్యాంపస్‌లో 30 మంది విద్యార్థుల పరిమిత సీట్లతో ప్రారంభం కానున్న ఈ మొదటి బ్యాచ్ క్లాసులు 2026 ఆగస్టు నుండి మొదలవుతాయి. ఈ కోర్సు కోసం అప్లికేషన్ల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. 2026 జులై మొదటి వారంలో దరఖాస్తుల గడువు ముగుస్తుంది. తరగతి గది అభ్యాసానికి, ఈ రంగంలోని వాస్తవ పనితీరుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎంబీఏ బీఎఫ్ఎస్ఐ (ఓఃం-ఃఈూఎ) కోర్సును రూపొందించారు. ఈ రంగం వాస్తవంగా ఎలా పనిచేస్తుందనే అంశాలను ప్రతిబింబించేలా కేపీఎంజీ ఇండియా ఈ పాఠ్యప్రణాళికను పాక్షికంగా సిద్ధం చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులు బ్యాంకింగ్ ఆపరేషన్స్, ఫైనాన్షియల్ అనాలిసిస్, రిస్క్ అండ్ కాంప్లయన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్ మరియు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వంటి విభాగాలలో ఇండస్ట్రీ కేస్ స్టడీస్, అప్లైడ్ లెర్నింగ్ మోడ్యూల్స్ మరియు క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అయితే విద్యార్థుల అసెస్మెంట్ మరియు గ్రేడింగ్ ప్రక్రియను మాత్రం పూర్తిగా అనురాగ్ యూనివర్సిటీ మాత్రమే నిర్వహిస్తుంది. ఈ మీడియా సమావేశంలో అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, అనురాగ్ పల్లా మరియు కేపీఎంజీ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ పార్ట్‌నర్ అండ్ నేషనల్ హెడ్, నారాయణన్ రామస్వామి మాట్లాడారు.

## కలెక్టరేట్‌లో సేద తీరుతున్న శునకాలు..

- పట్టించుకోని అధికారులు



**భద్రాద్రి కొత్తగూడెం (భారత శక్తి)** జిల్లా కలెక్టరేట్ శునకాలకు ఆవాసంగా మారింది. ప్రతి రోజు ఏదో ఒక చోట కుక్కల దాడులతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు గాయాలపాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కుక్కల దాడులను నియంత్రించాలని, వాటిని కట్టడి చేయాలని ప్రజలు అధికారులకు విన్నపాలు చేస్తూనే ఉన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు. తాజాగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే కార్యక్రమానికి తమ సమస్యలు పరిష్కరించమని వినతి పత్రాలు ఇవ్వడానికి వచ్చారు. కలెక్టరేట్‌లో గ్రామ సింహాలు హాయిగా కునుకు తీస్తున్న తీరును చూసి ఫిర్యాదుదారులు ఔరా అనుకుంటూ భయపడుతూ పక్కకు వెళ్తున్నారు. కుక్కల దాడులను నియంత్రించమంటే ఏకంగా గ్రామ సింహాలు కలెక్టర్ కార్యాలయంలో సేదతీరడం పై ఫిర్యాదుదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## నన్ను నా కొడుకు నుంచి రక్షించండి'..

- ప్రజావాణిలో వృద్ధురాలి కన్నీటి వినతి



**కొత్తగూడెం (భారత శక్తి)** నా కొడుకు, కోడలు నుంచి తనను కాపాడి, నా ఆస్తి , నా పొలం నాకు ఇప్పించాలని పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన 85 సంవత్సరాల వృద్ధురాలు భట్టు కోమి కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేసింది. సోమవారం గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసింది. భట్టు కోమికి ముగ్గురు కొడుకులు ఉండగా పెద్ద కొడుకు భట్టు రామ్ దన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మరో కుమారుడు భట్టు రవి దివ్యాంగుడు కాగా, మరొక తనయుడు భట్టు శ్రీనివాస్ మతిస్థిమితం కోల్పోయి బ్రతుకుతున్నారని తెలిపారు. అయితే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న పెద్ద కొడుకు నన్ను మంచిగా చూసుకుంటానని నమ్మబలికి నా తదనంతరం కర్మకాండలు చేస్తానని చెప్పి వారి ఇంటికి తీసుకువెళ్ళి ఇంటి స్థలం, నాలుగున్నర ఎకరాల పొలం కాగితాల పై నా సంతకం తీసుకొని ఇప్పుడు అన్నం పెట్టకుండా వేధింపులకు గురి చేస్తూ, దుర్భాషలాడుతున్నాడని, తనను కొడుతున్నాడని కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. తనకు వస్తున్న పెన్షన్ కూడా లాగేసుకుంటున్నారని కన్నీటి పర్యంతమైంది. తన భూమి, తన పెన్షన్ డబ్బులు ఇప్పించి కొడుకు, కోడలు బారి నుండి రక్షించాలని కోరింది. వెంటనే స్పందించిన కలెక్టర్ ఈ అంశం పై వెంటనే విచారణ చేయాలని ఆర్డీవోకు లేఖ రాశారు.

## కరీంనగర్‌లో జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం ఘనంగా నిర్వహణ

**కరీంనగర్ (భారత శక్తి)** జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ (ఐయూూ), వాసుదేవ్ హాస్పిటల్ మరియు అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137-ం సంయుక్త ఆధ్వర్యంలో రేకుర్తి, కరీంనగర్‌లో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన కోసం వాక్‌థాన్, పర్యావరణ పరిరక్షణ కోసం చెట్ల నాటడం, సమాజానికి విశిష్ట సేవలందించిన సీనియర్ జనరల్ సర్జన్లకు సన్మానం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఐయూూ అధ్యక్షులు డా. ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను నాటడం ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు.

జాతీయ శస్త్రచికిత్స నిపుణుల వారోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (యాఎ) ఆధ్వర్యంలో చెట్ల నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, రోగుల ఆరోగ్యం కోసం నిరంతరం సేవలందిస్తున్న శస్త్రచికిత్స నిపుణుల సేవలను గౌరవించడం, శస్త్రచికిత్స రంగంలో నాణ్యత, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, రోగి భద్రత మరియు వైద్యుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం ఈ వారోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రేకుర్తిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. ఎలగందుల శ్రీనివాస్, డా. వి. మంగీలాల్, డా. సాయి ప్రసాద్, డా. అరుణ్ కటారి, డా. వై. నరేంద్ర, డా. ప్రదీప్, డా. మహేందర్, డా. హరికృష్ణ, డా. శైలేంద్ర, డా. అనిల్, డా. సుధీర్, డా. రాజు, డా. జితేందర్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ కంజర్ల మహేష్, ఈద కుమారస్వామి, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ శర్మ, గాలిపల్లి నాగేశ్వర్, సాగర్ రెడ్డి మరియు వాసుదేవ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, "ఆరోగ్యం సేవ పర్యావరణ పరిరక్షణ" అనే లక్ష్యంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## హైదరాబాద్లో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్లో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం మరియు పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అల్పాహారం మరియు పాలు పంపిణీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు, పాఠశాలలకు హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## స్విమ్స్ కు రూ.1,00,116/- (రూ. లక్ష నూట పదహారు రూపాయలు) విరాళం

**(భారత శక్తి)** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రికి స్విమ్స్ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగుళూరు నగరానికి చెందిన యస్.బి. నరేష్ బాబు మరియు బి.యన్.గణేష్ బాబు కోరిక మేరకు స్విమ్స్ హాస్పిటల్ పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకొని విరాళం అందించినట్లు తెలిపారు. దాత తరపున తిరుపతి వాస్తవ్యులు వై.రాఘవేంద్ర చేతుల మీదుగా 1,00,116/- (లక్ష నూట పదహారు రూపాయలు) విరాళాన్ని డి.డి. రూపంలో 15.06.2026వ తేది సోమవారం ఉదయం 10 గంటలకు స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా? ఆర్.వి.కుమార్ కి అందజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా? ఆర్.వి. కుమార్ విరాళ దాతలు యస్.బి.నరేష్ బాబు మరియు బి.యన్.గణేష్ బాబు గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ

## బద్వేలు మెడికల్ షాపుల్లో దోపిడీ

- బెంబేలెత్తుతున్న రోగులు!




**బద్వేలు (భారత శక్తి)** నిరుపేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకుని బద్వేలు పట్టణం లోని పలు మెడికల్ షాపుల నిర్వాహకులు నిలువు దోపిడీకి తెరలేపారు. జీవన గమనంలో అత్యవసరమైన మందుల అమ్మకాల్లో ఇష్టారాజ్యంగా ధరలు వసూలు చేస్తూ ప్రజల రక్తాన్ని పిండుకుంటున్నారు. రోగమొస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా,ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లినా. చివరకు మందుల కొనుగోలు కోసం మెడికల్ షాపులకు రావాల్సిందే. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు మానవత్వాన్ని మరచి కాసుల కక్కుర్తితో విపరీతమైన రేట్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంఆర్పీ పేరుతో మాయాజాలంసాధారణంగా నాన్-షెడ్యూల్డ్ డ్రగ్స్, కొన్ని రకాల బ్రాండెడ్ కంపెనీల మందులపై ముద్రించే గరిష్ట విక్రయ ధర మార్కెట్ రేటు కంటే చాలా రెట్లు అధికంగా ఉంటుంది. ఈ లొసుగును బద్వేలు లోని కొందరు మెడికల్ షాపుల యజమానులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాస్తవానికి కొనుగోలు ధరపై నిర్ణీత లాభం (మార్జిన్) మాత్రమే వేసుకుని అమ్మాల్సి ఉండగా,స్ట్రిప్పులపై ఉన్న భారీ ఎంఆర్పీ ధరలకే విక్రయిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. మరికొన్ని చోట్ల నిరక్షరాస్యులైన గ్రామీణ రోగులను టార్గెట్ చేస్తూ. మందుల అసలు ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. బిల్లులు అడిగితే ముఖం చాటేస్తున్నారు! మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన ప్రతి ఔషధానికి పక్కా కంప్యూటర్ లేదా నగదు బిల్లు ఇవ్వాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, బద్వేలు లోని మెజారిటీ షాపుల్లో రోగులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా చదువుకున్న వారు బిల్లు అడిగితే. జీఎస్టీ అదనంగా పడుతుంది,కంప్యూటర్ పని చేయడం లేదు"అంటూ సాకులు చెబుతూ ముఖం చాటేస్తున్నారు. బిల్లులు ఇవ్వకపోవడం వల్ల తాము ఎంత దోచుకుంటున్నామో బయటకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. నాణ్యత లేని 'జెనరిక్' మందులు. బ్రాండెడ్ ధరలు! అతి తక్కువ ధరకు లభించే కొన్ని కంపెనీల జెనరిక్ మందులను తెచ్చి,వాటిని కార్పొరేట్ కంపెనీల బ్రాండెడ్ మందుల ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారు. రోగులకు ఏ మందులు ఇస్తున్నారో, అవి ఎంతవరకు పనిచేస్తున్నాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది. డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్‌లో ఉన్న మందులు కాకుండా,వాటికి ప్రత్యామ్నాయంగా తమకు ఎక్కువ లాభాలు వచ్చే మందులను రోగుల చేతుల్లో పెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రజలే ప్రధాన లక్ష్యం బద్వేలు చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యలోని గ్రామాల నుంచి పేద ప్రజలు, కూలీలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. మందుల ధరలపై అవగాహన లేకపోవడం వల్ల వ్యాపారులు ఎంత చెబితే అంత డబ్బులు చెల్లించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి మరీ రోగాల నివారణకు మందులు కొంటున్నామని, కానీ ఇక్కడి రేట్లు చూస్తే గుండె ఆగుతోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిఘా కరవు! మండలంలో ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (ఔషధ నియంత్రణ శాఖ అధికారులు) గానీ,స్థానిక అధికారులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపుల్లో కనీసం ధరల పట్టికను కూడా ప్రదర్శించడం లేదు. నిబంధనల ప్రకారం క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్‌లు షాపుల్లో ఉండాలి. కానీ,ఇక్కడ క్లీనర్లు, సహాయకులే మందులు ఇస్తున్న దాఖలాలు ఉన్నాయి. అధికారుల ఉదాసీనత వల్లే మెడికల్ మాఫియా రెచ్చిపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలిఉన్నతాధికారులు స్పందించి బద్వేలు కేంద్రంలోని అన్ని మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించాలి. పక్కా బిల్లుల విధానాన్ని అమలు చేయాలి. ఎంఆర్పీ ధరల దోపిడీపై ప్రత్యేక నిఘా పెట్టాలి. నిబంధనలు ఉల్లంఘించే షాపుల లైసెన్సులను రద్దు చేయాలి. వైద్యాన్ని వ్యాపారంగా మార్చి ప్రజల ప్రాణాలతో,సొమ్ముతో చెలగాటమాడుతున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి

- కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి.

**(భారత శక్తి)** స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్



క్లీన్ స్వీప్ లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని

# ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి




**హైదరాబాద్ (భారత శక్తి)** జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ ఢీకొని ఇద్దరు ఆటో డ్రైవర్లు మృతి చెందారు. మీర్పేట్ పోలీస్ స్టేషన్ సమీపంలో మండమల్లమ్మ చౌరస్తా వద్ద ఆటో పాడైపోయిందని సంతోష్(26) అనే ఆటో డ్రైవర్ తన స్నేహితులు ప్రసాద్, సునీల్(33)లకు సమాచారం ఇచ్చాడు. మండమల్లమ్మ చంద్రా గార్డెన్స్ వద్ద సంతోష్ ఆటోను తన ఆటోకు తాడుతో కట్టి తరలించేందుకు సునీల్, ప్రసాద్ సిద్ధమయ్యారు. ఆదే సమయంలో ఎల్బీనగర్ వైపు నుండి వేగంగా వచ్చిన జీహెచ్ఎంసీ చెత్త టిప్పర్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

## బాలికపై అత్యాచారనీ మరియు హత్యాయత్నం చేసిన గౌస్‌ని వెంటనే ఉరి తీయాలి

### – దుర్గా వాహిని విశ్వహిందూ పరిషత్

**హైదరాబాద్(భారత శక్తి)** ఖమ్మం లోని 12 ఏళ్ల బాలిక పై 50 ఏళ్ల మహ్మద్ గౌస్ పాషా లైంగిక దాడి చేయడమే కాకుండా మేడ పై నుంచి కిందకు తోసేయడం అత్యంత దారుణమని విశ్వ హిందు పరిషత్ దుర్గా వాహిని ప్రాంత సంయోజిక వాణి సక్కుబాయి అన్నారు. నిమ్స్ లో చికిత్స పొందుతున్న బాలికను వాణి సక్కుబాయి , దుర్గా వాహిని ప్రాంత సభ్యులు శిరీష, భవాని గాయత్రీలు పరామర్శించారు. అనంతరం వాణి సక్కుబాయి మాట్లాడుతూ.. బాలిక పై అత్యాచారం చేసిన నిందితుడిని సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి వెంటనే ఉరి తీయాలన్నారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం తక్షణం అందించాలని, ఇంట్లో ఒకరికి ప్రభ్యుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి యావత్ సమాజం అండగా ఉండాలని తెలిపారు

# ఒకే కుటుంబంలోని ముగ్గురు ఆత్మహత్య




**నెల్లూరు(భారత శక్తి)** సంగం మండలం దువ్వూరు గ్రామంలో విషాదం నెలకొంది. ఇంట్లో రిటైర్డ్ టీచర్ మధు కుటుంబం ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని..విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరణ వాంగ్మూలం బీరువాలోని ఫోటో అల్బంలో వుందని ఒక చీటి రాసి బిరువాకు అతికించారు.

# అక్బర్ బాగ్‌లో ఉద్రిక్తత

### – హిందూ సంఘాల అందోళన

**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్ పాతబస్తీ చదర్ ఘట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్బర్బాగ్లో బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో బట్టలు ఆరేయడాన్ని దేవాలయానికి చెందిన కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం కొందరు యువకులు దేవాలయ కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారు.ఈ ఘటన తెలుసుకున్న హిందూ సంఘాలు వందల సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ నాయకులు వీరేందర్ యాదవ్, వినోద్, నరసింహ, రాజేష్, బి ర్ స్ నాయకులు శ్రీధర్ రెడ్డి, బస్తి వాసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితులఫిర్యాదు తో చదర్ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.అక్బర్ బాగ్ పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి దేవాలయం వద్ద పికెటింగ్ ఏర్పాటు చేశారు....

# అర్ధరాత్రి రైలులో దొంగల బీభత్సం..

### – పోలీసులపై ఎదురుకాల్పులు!

**బాపట్ల(భారత శక్తి)** జిల్లాలో అర్ధరాత్రి రైలులో దొంగలు బీభత్సం సృష్టించారు. చెంగల్పట్టు నుంచి కాకినాడ వెళ్తున్న సర్కార్ ఎక్స్ప్రెస్ పై అప్పికట్ల–మాచవరం మధ్య 2:30 సమయంలో దుండగులు దాడి చేశారు. ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు లాక్కున్నారు. బాధితులు కేకలు వేయడంతో చైన్ లాగి పరారయ్యారు. వీరిని అడ్డుకునేందుకు ఉఖీఖ పోలీసులు కాల్పులు జరపగా, దొంగలు కూడా ఎదురుకాల్పులు చేశారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

# దూకుడు ప్రదర్శించని బీఆరెస్

**హైదరాబాద్, (భారత శక్తి)**
తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం ఒక విలక్షణమైన, అత్యంత సంక్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం గులాబీ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. పార్టీ పయనంపై రకరకాల ప్రచారాలు జరుగుతున్న సమయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతర్గత సమావేశాల్లో వచ్చే ఎన్నికల్లో మనది ఒంటరి పోరే.. ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు అని గట్టిగా చెప్తున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం ఆ మాటలపై ఇంకా నమ్మకం కలగడం లేదు. దీనికి ప్రధాన కారణం.. కేంద్రంలోని బీజేపీపై, మోదీ ప్రభుత్వంపై కేటీఆర్ గానీ, కేసీఆర్ గానీ ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించకపోవడమే.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను నిశితంగా గమనిస్తే, బీఆర్ఎస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు క్రమంగా బీజేపీ వైపు మళ్లినట్లు స్పష్టమైంది. గతంలో గులాబీ వైపు నిలిచిన అర్బన్, సెమి-అర్బన్, హిందూ ఓటర్లు గంపగుత్తగా కమలం వైపు మొగ్గు చూపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ చేసిన ప్రతిపక్ష స్థానాన్ని తామే భర్తీ చేశామని, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ గట్టిగా చాటుకుంటోంది.

ఇలాంటి తరుణంలో, తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి అసలు క్షేత్రస్థాయి బలం లేదని కేటీఆర్ ప్రకటిస్తున్నారు. కానీ, తమ ఓట్లను లాగేసుకున్న బీజేపీని ధాటుగా ఎదుర్కోకుండా, కేవలం కాంగ్రెస్‌నే టార్గెట్ చేయడం పొలిటికల్ సర్కిల్స్‌లో పలు అనుమానాలకు తావిస్తోంది. బీజేపీపై సాఫ్ట్ పాలిటిక్స్ నడుపుతూ.. రేపటి ఎన్నికల్లో ఆ పార్టీనే మాకు ప్రధాన ప్రత్యర్థి అని చెప్తే ప్రజలు కన్విన్స్ అవ్వడం కష్టమేన్న అభిప్రాయం వినిపిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయకారీ ఒప్పందం ఉందంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంలో బీఆర్ఎస్ అధినాయకత్వం విఫలమవుతోంది. కవిత బెయిల్ వ్యవహారం దగ్గర నుంచి నేటి వరకు కేంద్ర సంస్థల దూకుడు తగ్గడం, పార్లమెంట్‌లో కీలక బిల్లులపై బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం వహించడం వంటి పరిణామాలు బీజేపీ-బీఆర్ఎస్ భాయ్ భాయ్ అనే రూమర్లకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. నిత్యం సోషల్ మీడియాలో, వార్తల్లో విలీనం లేదా పొత్తుల గురించిన రచ్చ జరుగుతూనే ఉంది. ఈ ప్రచారానికి శాశ్వతంగా చెక్ పెట్టాలంటే కేవలం ఆఫ్‌లైన్ ప్రకటనలు సరిపోవు, క్షేత్రస్థాయిలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆన్‌లైన్, ఆన్‌గ్రౌండ్ పోరాటాలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. త్వరలో జరగబోయే గ్రేటర్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ఒక పెద్ద యాసిడ్ టెస్ట్. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవాలంటే.. అటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిన అన్యాయాలను అంతే తీవ్రంగా నిలదీయాలి.

అలా కాకుండా కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనే 100% ఫోకస్ పెట్టి, కేంద్రంపై చిన్న విమర్శ కూడా చేయకపోతే, ప్రజలు బీఆర్ఎస్‌ను కేవలం ఒక 'బి-టీమ్' గానే చూసే ప్రమాదం ఉంది. ఏదైనా ఒక ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీలతో తలపడేటప్పుడు రెండు వైపులా సమానమైన దూకుడు ప్రదర్శించినప్పుడే పొలిటికల్ సీరియస్‌నెస్ కనిపిస్తుంది. కేటీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదనే విమర్శలు పోవాలంటే.. బీజేపీ హిడెన్ ఎజెండాను కూడా గులాబీ పార్టీ అంతే ధీటుగా బట్టబయలు చేయాలి. లేదంటే, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బీఆర్ఎస్ ఎంత మొత్తుకున్నా, విశ్లేషకులు గానీ, అటు ఓటర్లు గానీ దాన్ని పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి, సాఫ్ట్ పాలిటిక్స్ పక్కనబెట్టి తీవ్రమైన దూకుడు ప్రదర్శించడమే ఇప్పుడు కేటీఆర్ ముందున్న ఏకైక మార్గం.

## రెండేళ్లలో మహిళా, శిశు మరియు

# గిరిజన సంక్షేమ రంగాల్లో అపూర్వ ప్రగతి

**– సంక్షేమం నుంచి సాధికారత వైపు... – భద్రత నుంచి సమగ్ర అభివృద్ధి దిశగా ముందడు**

**– గురాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**

**అమరావతి (భారత శక్తి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ రంగాలను అత్యున్నత ప్రాధాన్యతా రంగాలుగా గుర్తించి గత రెండు సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సంక్షేమం అనేది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని, ప్రతి మహిళకు భద్రత, ప్రతి చిన్నారికి పోషకాహారం, ప్రతి గిరిజన కుటుంబానికి అభివృద్ధి అవకాశాలు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి బలహీన వర్గానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు.

### సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం?

గత రెండు సంవత్సరాల కాలంలో మహిళా, శిశు మరియు గిరిజన సంక్షేమ శాఖలు అమలు చేసిన కార్యక్రమాలు లక్షలాది మంది జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయని మంత్రి పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు సంక్షేమ ఫలాలు చేరేలా, మహిళలు భయరహితంగా జీవించేలా, పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేలా, గిరిజనులు గౌరవప్రదమైన జీవనం గడిపేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆమె స్పష్టం చేశారు. సంక్షేమాన్ని సాధికారతగా, అభివృద్ధిని సామాజిక న్యాయంగా, ప్రభుత్వాన్ని ప్రజల జీవితాల్లో విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే మా లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు.మహిళా, శిశు సంక్షేమ రంగంలో సమగ్ర సంస్కరణలు రాష్ట్రవ్యాప్తంగా 56,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమగ్ర పోషణ, ఆరోగ్య సేవలు, పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు 20 లక్షల మంది లబ్ధిదారులు ఈ సేవలను పొందుతున్నారని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పోషకాహార సరఫరా కొనసాగించడంతో పాటు అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టామని చెప్పారు. అంగన్‌వాడీ సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించేందుకు 5,389 మంది అంగన్‌వాడీ టీచర్ల నియామకం, 5,287 మంది ఆయాల నియామకం ద్వారా మొత్తం 11 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ?

అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పోషకాహార పంపిణీ కేంద్రాలుగానే కాకుండా, చిన్నారుల సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. సుమారు రూ.100 కోట్ల వ్యయంతో 10,000 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలు, ఆర్.ఓ. ప్లాంట్లు, భవన మరమ్మతులు, పారిశుద్ధ్య సదుపాయాలు, వంట సామగ్రి, పచ్చదనం పెంపు కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ చేపట్టామని, దీనివల్ల ఇంధన పొదుపు, పరిశుభ్రత, సమర్థవంతమైన వంట ప్రక్రియ సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

### సాంకేతికతతో అంగన్‌వాడీ సేవలకు నూతన రూపం?

డిజిటల్ పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో రూ.72 కోట్ల వ్యయంతో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు ఆధునిక 5జి స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, పోషకాహార పంపిణీ, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారం, హాజరు నమోదు, ప్రభుత్వ పథకాల అమలు రియల్ టైమ్‌లో పర్యవేక్షించబడుతోందని వివరించారు

.మహిళల భద్రతకు సమగ్ర రక్షణ వ్యవస్థ?మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వన్ స్టాప్ సెంటర్లు ఏర్పాటు చేసి మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సలహాలు, వైద్య సేవలు, మానసిక స్థైర్యం కల్పించడంతో పాటు పోలీసు సహకారం ఒకే వేదికపై అందిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో వేలాది మంది మహిళలు ఈ సేవల ద్వారా లబ్ధి పొందారని పేర్కొన్నారు.

# వీడని జ్ఞానేశ్వరి అదృశ్యం మిస్టరీ..

**కాకినాడ, (భారత శక్తి)** కాకినాడ జిల్లా తుని మండలంలో చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. : చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన మిస్టరీ ఇంకా వీడడం లేదు. ఆ చిన్నారి అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తోంది. వందలాది మంది పోలీసులు జల్లెడ పడుతున్నారు. కానీ ఇంతవరకు ఆచూకీ లేదు. ఈ నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై ఆరా తీసారు. కాకినాడ ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కనుకునేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాలింపు చర్యల్లో పోలీస్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో పాటు ఎస్టీఆర్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. దట్టమైన అడవుల్లో సైతం వెళ్ళగలిగే అటవీ శాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంపు వాచర్స్, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని కూడా ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు పలుమార్లు గాలింపు చర్యలు చేపట్టినా చిన్నారి ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. చిన్నారి కనిపించకుండా పోయినప్పటి నుంచి ఆమె కోసం అన్ని దిశల్లో అన్వేషణ కొనసాగుతోంది. పాప సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, చిన్నారి కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న అధికారులు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన హనుమాన్ టీం రంగంలోకి దిగింది. నిన్న అర్ధరాత్రి నుంచే అటవీ ప్రాంతాల్లో సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించిన బృందాలు అడవిలోని ప్రతి ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. చిన్నారి జాడ కోసం పోలీసులు, అటవీశాఖ సిబ్బంది, ప్రత్యేక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రెండు థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. రాత్రి సమయంలో కూడా స్పష్టమైన సమాచారాన్ని సేకరించేందుకు ఈ డ్రోన్లు సహాయపడుతున్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా అడవిలోని పొదలు, లోయలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, హనుమాన్ టీం సభ్యులు కలిసి విస్తృత స్థాయిలో గాలింపు కొనసాగిస్తున్నారు. చిన్నారి ఎక్కడైనా చిక్కుకుని ఉండొచ్చనే అనుమానంతో ప్రతి ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.అటవీశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం, ఆ ప్రాంతంలో మనుషులపై దాడి చేసే క్రూర జంతువులు ఉండే అవకాశం చాలా తక్కువగా ఉందని చెబుతున్నారు. దీంతో చిన్నారి క్షేమంగా ఉండే అవకాశాలపై ఆశాభావం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం కొనసాగుతున్న ఈ సెర్చ్ ఆపరేషన్‌పై స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే పాప జాడ లభించాలని అందరూ ప్రార్థిస్తున్నారు.

పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి..

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. 8 రోజులు దాటుతున్న ఆచూకీ దొరకకపోవడంతో పోలీస్ శాఖ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాదాపు 400 మంది పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు పాల్గొంటున్నారు. అత్యాధునిక డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. చిన్నారితో పాటు కనిపించకుండా పోయిన కుక్క ప్రత్యక్షం కావడంతో.. దానికి జిపిఆర్ఎస్ కట్టి అడవుల్లో వదిలారు.. అయినా సరే ఎటువంటి ఫలితం లేకపోయింది. అయినా సరే ప్రయత్నాల్లో ఉంది పోలీస్ శాఖ. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసు ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపారు. కాకినాడ ఎస్పీకి నేరుగా ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

అయితే పోలీస్ శాఖ గత ఎనిమిది రోజులుగా చేపట్టిన దర్యాప్తును వివరించారు కాకినాడ జిల్లా ఎస్పీ. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించామని ఎస్పీ వివరించారు. కాగా జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కేసులో కీలకంగా మారిన పెంపుడు కుక్క ఊహించని రీతిలో చనిపోయింది. గత రెండు రోజులుగా విచిత్రంగా ప్రవర్తించిన ఆ కుక్క.



చివరకు శనివారం చనిపోయింది. చిన్నారితో పాటుగానే ఈ కుక్క కనిపించకుండా పోయింది. నాలుగు రోజుల కిందట తిరిగి వచ్చింది. చిన్నారి ఇంటి వద్దకు చూసి కంగారుతో అడవిలోకి పారిపోయింది. అతి కష్టం మీద ఆ కుక్కను బంధించారు. ఆ కుక్కకు జిపిఎస్ ట్రాకర్ అమర్చి చిన్నారి జాడ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం విఫలం కాగా.. శనివారం కుక్క సైతం చనిపోవడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

# 'రాఖ్' సిరీస్ రివ్యూ!



గతంలో అమెజాన్ ప్రైమ్ లో వచ్చిన ' పాతాళ్ లోక్' సిరీస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సీజన్ వన్ కి దర్శకత్వం వహించిన ప్రోసిత్ రాయ్, తాజాగా 'రాఖ్' సిరీస్ ను అందించాడు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సిరీస్ ఇది. సీజన్ వన్ గా 8 ఎపిసోడ్స్ ను వదిలారు. హిందీలో రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 12వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. అలీ ఫజల్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సిరీస్, తెలుగుతో పాటు ఇతర భాషల్లోను అందుబాటులో ఉంది. ఢిల్లీ నగరంలో కర్నల్ అశోక్ (ఆమీర్ బషీర్) ఫ్యామిలీ నివసిస్తుంటుంది. భార్య మోనా (సోనాల్ బెంద్రే) టీనేజ్ లోకి అడుగుపెట్టిన సుమన్ (దివ్య శర్మ) సోహెల్ (వివాన్ శర్మ) ఇదే అతని కుటుంబం. పాప సుమన్ .. బాబు సోహెల్ ఇద్దరూ చదువుతున్న స్కూల్ లోనే మోనా టీచర్ గా పనిచేస్తుంటుంది. సుమన్ ఆల్ ఇండియా రేడియోలో తరచూ పాటలు పాడుతూ ఉంటుంది. అలాగే ఒక రోజున తమ్ముడు సోహెల్ తో కలిసి ఆమె పాటలు పాడటానికి వెళుతుంది. కానీ ఆ తరువాత ఇద్దరు పిల్లలూ తిరిగిరారు. మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగుతారు. ఈ కేసును సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలనే పట్టుదలతో ఎస్ ఐ జయప్రకాశ్ (అలీఫజల్) ఉంటాడు. సిటీకి దూరంగా ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో పిల్లలిద్దరి డెడ్ బాడీలు లభిస్తాయి. అత్యంత కౄరంగా వాళ్లపై దాడి చేసిన తీరు, ఢిల్లీ నగరాన్ని భయపెడుతుంది. ఓ ప్రముఖ దిన పత్రికలో రిపోర్టర్ గా పనిచేస్తున్న 'నిసార్' కూడా ఆధారాలు సేకరించే పనిలో పడుతుంది. జయప్రకాశ్ ఇన్వెస్టిగేషన్ ముందుకు వెళుతున్నా కొద్దీ, తెరపైకి వచ్చిన రజ్జో (రమణ్ దీప్ యాదవ్) బాబు (ఆకాశ్ మఖిజా) అనే వారి పేర్లు పెద్దవవుతూ ఉంటాయి. ముంబైలో చిల్లర దొంగతనాలు చేస్తూ ఉండే ఈ ఇద్దరే, జరిగిన హత్యలకు కారకులనే అనుమానాలు బలపడుతూ ఉంటాయి. దాంతో వాళ్లను పట్టుకోవడానికి జయప్రకాశ్ రంగంలోకి దిగుతాడు. ఈ ప్రయత్నంలో ఆయనకి ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా అధిగమిస్తాడు? అనేదే కథ. 1978లో ఢిల్లీలో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా రూపొందించిన సిరీస్ ఇది. ఇటు ఢిల్లీ .. అటు ముంబై నగరాల నేపథ్యంలో ఈ కథ మొదలవుతుంది. ఢిల్లీలో జరిగిన ఇద్దరు టీనేజర్స్ హత్యలకీ .. ముంబైలో చిల్లర దొంగతనాలకు పాల్పడే ఇద్దరు దుర్మార్గులు ఎలా కారకులయ్యారు? అనే అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. అనేక చిక్కుముడులతో కూడుకున్న ఈ కేసును పోలీస్ ఆఫీసర్ జయప్రకాశ్ ఎలా ఛేదిస్తాడు? అనేది ఉత్కంఠను రేకెత్తించే అంశం. ఈ కథ విన్నప్పుడు, హత్యలు .. దొంగతనాలు .. ఇన్వెస్టిగేషన్ తో కూడుకున్న కథలు గతంలో చాలానే వచ్చాయి గదా .. ఇందులో కొత్తేముంది? అనిపించడం సహజం. కానీ ఈ సిరీస్ ఫస్టు ఎపిసోడ్ చూసిన తరువాత ఇక చివరి ఎపిసోడ్ చూసేవరకూ వదిలిపెట్టరు. గతంలో ఈ తరహా కథలు వచ్చినప్పటికీ, దర్శకుడు స్క్రీన్ ప్లేతో మేజిక్ చేశాడని చెప్పాలి. ఆ స్క్రీన్ ప్లేనే ఆడియన్స్ ను మొదటి ఎపిసోడ్ నుంచి 8వ ఎపిసోడ్ వరకూ కదలనీయకుండా చేస్తుంది. ఒక వైపున తాము బిందాస్ గా గడపడం కోసం ఏం చేయడానికైనా తెగించే ఇద్దరు దొంగలు. మరో వైపున ఆర్మీ ఫ్యామిలీలో పద్ధతిగా పెరిగిన ఇద్దరు అక్కా తమ్ముళ్లు. ఒక పోలీస్ ఆఫీసర్ గా తానేమిటనేది నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్న జయప్రకాశ్. ఈ మూడు వైపుల నుంచి కథ పరిగెడుతూ ఉంటుంది. మూడు వైపుల నుంచి పడుతున్న సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే ఒక కుతూహలం ఆడియన్స్ మనసులో ఆందోళన కలిగించడం మొదలుపెడుతుంది. టీనేజర్స్ కి సంబంధించిన సన్నివేశాలు మనలను కలవరపాటుకు గురిచేస్తాయి. హంతకులకు సంబంధించిన ట్రాక్ ఆడియన్స్ ను కచ్చితంగా టెన్షన్ కి గురిచేస్తుంది. ఇక ఈ కేసు విషయంలో తనకి ఎదురవుతున్న ఆటంకాలను దాటుకుంటూ పోలీస్ ఆఫీసర్ ముందుకు వెళ్లిన తీరు ఆ పాత్ర పట్ల అభిమానాన్ని పెంచుతుంది. ఈ మూడు ట్రాకులలో ఎక్కడా కూడా అనవసరమైన సన్నివేశమనేది కనిపించదు. ప్రతి సన్నివేశం మన కళ్లముందు జరుగుతున్నట్టుగా ఉంటుంది. నిజానికి ఇది 1978లో జరిగే కథ అయినప్పటికీ, ఆ కాలాన్ని మరిచిపోయి కళ్లప్పగించి చూసేలా చేసే సిరీస్ ఇది. ఒక కుటుంబమనేది లేకుండా .. ఒక అడ్రెస్ అనేది లేకుండా .. ఈజీ మనీకి అలవాటు పడిపోయిన నేర స్వభావం కలిగిన వ్యక్తులు సమాజానికి ఎంతటి ప్రమాదకరమనేది ఈ సిరీస్ చూస్తే అర్థమవుతుంది. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మూల్యం చెల్లించక తప్పదనే సందేశాన్ని ఈ సిరీస్ ఇస్తుంది. మొదటి ఎపిసోడ్ నుంచి చివరి ఎపిసోడ్ వరకూ కథ చాలా ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే రిమోట్ పక్కన పెట్టేస్తారు. 7 .. 8 ఎపిసోడ్స్ మరింత టెన్షన్ పెట్టేస్తాయి. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా తమ పాత్రలలో ఇమిడిపోయారంటేనే కరెక్టుగా ఉంటుంది. హంతకులలో 'బాబు' పాత్రను పోషించిన నటుడు, ఆ పాత్రలో జీవిస్తూ ఆడియన్స్ ను భయపెట్టాడనే చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే సైకో కిల్లర్స్ నటనే ఈ సిరీస్ కి హైలెట్. ఫొటోగ్రఫీ ఈ సినిమాకి ప్రధానమైన బలం అని చెప్పాలి. నైట్ ఎఫెక్ట్ సీన్స్ .. రెయిన్ ఎఫెక్ట్ సీన్స్ ఆవిష్కరణ బాగుంది. ఆ తరువాత స్థానంలో నేపథ్య సంగీతం నిలుస్తుంది. సన్నివేశాలలో నుంచి ఆడియన్స్ ఎక్కడా జారిపోకుండా చేస్తుంది. ఎడిటింగ్ ఫరవాలేదు. ఈ తరహా కథలు గతంలో చాలానే వచ్చినప్పటికీ, స్క్రీన్ ప్లే పరంగా ఈ సిరీస్ మెప్పిస్తుంది. సన్నివేశాలు చాలా సహజంగా అనిపిస్తూ, మన కళ్లముందు జరుగుతున్నాయనేమో అనేంత ఫీల్ ను కలిగిస్తాయి. పాత్రలను .. ఆ పాత్రల స్వరూప స్వభావాలను డిజైన్ చేసిన తీరు ఎమోషనల్ గా కనెక్ట్ చేస్తాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ గా ఈ సిరీస్ ను గురించి చెప్పుకోవచ్చు.

## ముంబైలో టీవీ నటి సంచిత ఆత్మహత్య



బుల్లితెర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. పలు టీవీ సీరియళ్ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి సంచిత ఉగలే (22) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముంబై శివారులోని నాలాసోపరాలో గల తన నివాసంలో ఆదివారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు దీనిని ఆత్మహత్యగా ధ్రువీకరించారు. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 14వ తేదీ సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య సంచిత తన గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చూసేసరికి, ఆమె చీరతో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సంచిత 'కుంకుమ్ భాగ్య', 'దిల్వాలే దుల్హా లే జాయేంగే', 'వాగ్లే కీ దునియా' వంటి ప్రజాదరణ పొందిన సీరియళ్లతో పాటు 'ఛావా' అనే చిత్రంలోనూ నటించారు. ఆమె ఆకస్మిక మరణవార్తతో టీవీ పరిశ్రమ దిగ్భ్రాంతికి లోనైంది. అయితే, ఆమె గత కొంతకాలంగా కుంగుబాటుతో బాధపడుతున్నారని తెలుస్తోంది. ఆత్మహత్యకు కొన్ని గంటల ముందు కూడా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఉల్లాసంగా ఉన్న ఫోటోలను పోస్ట్ చేయడం గమనార్హం. ప్రస్తుతం పోలీసులు యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులను, సహోద్యోగులను విచారిస్తున్నారు.

## దేవుడు వరమందిస్తే..



సందీప్ అశ్వ, సన్యా ఠాకూర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రిస్క్'. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. జీకే మిరాకిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాని జూన్ 26న విడుదల చేయనున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలో 'దేవుడు వరమందిస్తే..' అంటూ సాగే మెలోడీయస్ సాంగ్‌ని ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథరావు విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ఘంటాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, చిత్ర నిర్మాతలు రవి సురేశ్‌రెడ్డి, గుర్రం నర్సిములు, సహ నిర్మాత గడ్డం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ, స్నేహం, ఎమోషన్స్, సస్పెన్స్ అంశాల మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం యువతను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు.

### వరుస విజయాలతో స్టార్ హీరోయిన్

## డిమాండ్ పెరిగిందా..



సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ స్ట్రాంగ్ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతి సారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. కొన్ని నివేదికల ప్రకారం, తాజాగా ఒక బైలింగ్వల్ ప్రాజెక్ట్ కోసం త్రిష భారీ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. త్రిష లేదా నిర్మాతల తరఫున కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.



## గర్వంగా చెప్పుకోలేని

## ఎన్నో సినిమాల్లో నటించా..

### - హాట్ టాపిక్‌గా సమంత కామెంట్స్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత టైటిల్ రోల్‌లో నటిస్తున్నచిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సమంత తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించానంది సామ్. చాలా తక్కువ టైంలోనే ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు.. ఉత్సాహంగా నా పేరును కేకలు వేస్తూ పిలవడం, నా సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. ఇదంగా చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆ స్టార్‌డమ్ అనే మాయలో మునిగిపోయానని చెప్పింది సమంత. అంతేకాదు మీడియా నా గురించి రాస్తోంది. ఏడాదికి నేను ఎన్ని సినిమాల్లో నటించాననే విషయాలపైనే ఎక్కువ ఆసక్తి చూపించేదానిని అంటూ చెప్పుకొచ్చింది. హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్ సినిమాలను అందిస్తున్నప్పటికీ తాను అసలు సినిమాకు ఏం ఇస్తున్నానని ఎప్పుడూ కూడా ఆలోచించలేదని చెప్పింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగుతున్న ట్రైలర్ సినిమాలో సామ్‌ను సరికొత్తగా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## ప్రజలను కుక్కలతో పోల్చానా?.. వారు నాకు తల్లితో సమానం: రాఘవ లారెన్స్



ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తనపై జరుగుతున్న ఓ దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. ప్రజలను కుక్కలతో పోల్చానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, తన మాటలను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం ఏమిటో వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇటీవల రాఘవ లారెన్స్ రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు, అభిమానులు ఆమోదిస్తేనే తన రాజకీయ ప్రయాణం మొదలుపెడతానని, లేదంటే ఈ ఆలోచనను విరమించుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన తర్వాత ఆయన తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. ఇదే సమయంలో ఆయన ప్రజలను ఉద్దేశించి కించపరిచేలా మాట్లాడారంటూ ఓ వీడియో క్లిప్ వైరల్ అయింది. ఈ వివాదంపై లారెన్స్ సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. "అందరికీ నమస్కారం. నా ఇటీవలి ప్రెస్ మీట్‌కు సంబంధించి ఒక అపోహను నివృత్తి చేయాలనుకుంటున్నాను. నా అభిమానులు, ప్రజలు నాకు అమ్మతో సమానమని నేను ఎప్పుడూ చెబుతుంటాను. అలాంటిది నేను ప్రజలను కుక్కలతో పోల్చానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అసత్యం" అని ఆయన పేర్కొన్నారు. తాను చెప్పిన అసలు ఉద్దేశాన్ని వివరిస్తూ.. "మనం ఒక కొత్త ఇంటికి మారినప్పుడు, అక్కడి పరిసరాలను, ఆ ప్రాంతంలోని కుక్కల అలవాట్లను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుందని చెప్పాను. అంతేగానీ నేను ఎంతో గౌరవించే, అమ్మలా భావించే ప్రజలను కుక్కలతో పోల్చేంత కఠిన హృదయుడిని కాను. కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి సమయం పడుతుందనే విషయం గురించి మాత్రమే నేను మాట్లాడాను" అని స్పష్టం చేశారు. దయచేసి అందరూ ఆ పూర్తి వీడియోను చూసి, తాను నిజంగా ఏం చెప్పానో అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన వివరణకు మద్దతుగా అసలు వీడియోను కూడా తన పోస్టులో పంచుకున్నారు. రాజకీయ రంగ ప్రవేశంపై ప్రజాభిప్రాయం కోరుతున్న తరుణంలో ఈ వివాదం చెలరేగడం, దానిపై లారెన్స్ వెంటనే స్పందించి వివరణ ఇవ్వడం జరిగింది.

## సైనిక దుస్తుల్లో వలసపాలన గుర్తులు అవుట్

**-ఆర్మీ యూనిఫాంలో 'స్వదేశీ' మార్పులు**





న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి ,జూన్ 15: బ్రిటిష్ కాలం నాటి పాత పద్ధతులకు ముగింపు పలుకుతూ, భారత సైన్యం తన యూనిఫాం నిబంధనలలో కీలక మార్పులు చేసింది. రివ్యూయింగ్ అధికారులు కచ్చితంగా కత్తులు (ఖడ్గాలు) పట్టుకోవాలనే రూల్‌ను పూర్తిగా ఎత్తేసింది. కొన్ని రకాల మెస్ దుస్తులతో పాటు పౌచ్ బెల్టులు వేసుకునే విధానాన్ని కూడా రద్దు చేసింది. గతంలో వాడిన 'రాయల్' లాంటి వలసపాలన పదాల వాడకాన్ని పూర్తిగా బంద్ పెట్టింది. మన దేశ సార్వభౌమత్వానికి ప్రతీకగా సివిల్ ఫార్మల్ దుస్తుల స్థానంలో స్వదేశీ బండీ జాకెట్‌ను ఆర్మీ తీసుకొచ్చింది. ఈ వివరాలన్నింటినీ తాజాగా విడుదల చేసిన 'ఆర్మీ యూనిఫామ్స్- 2026' గైడ్‌లైన్స్‌లో స్పష్టంగా పేర్కొంది.

## ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 15 : కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 93 దరఖాస్తులు వచ్చాయని భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ , ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ప్రజలు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ వి గిరి, జడ్ పి సిఈఓ చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## భారీ వరదల ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం గా ఎస్ ఎన్ డీ పీ ప్రాజెక్టు ను పూర్తి చేయాలి : తుంగతుర్తి రవి



ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 15: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, మేడిపల్లి మరియు పీర్జాదిగూడ డివిజన్లలో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించినప్పుడు నీరు నిల్వకుండా ఉండేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను పరిశీలించడానికి మున్సిపల్ అధికారులు, హైడ్రా అధికారులు మరియు పోలీస్ శాఖ సిబ్బంది సంయుక్తంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ రహదారితో పాటు మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో గతంలో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించి, నీటి పారుదల పరిస్థితులను పరిశీలించారు. తుంగతుర్తి రవి అధికారులకు ఆయా ముంపు ప్రాంతాలను చూపించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వర్షాకాలంలో వరద నీరు వేగంగా వెళ్లిపోయేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అడ్డంకులను తొలగించడం, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అలాగే ఈ వరదలకు శాశ్వత పరిష్కారంగా ఎస్ ఎన్ డీ పీ ప్రాజెక్టును నిర్మించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తే వరదలకు చెక్ పెట్టొచని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పరిస్థితిని సమీక్షించి, భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడతామని తెలిపారు. నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న సమస్యలను గుర్తించి, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలోఏసీపీ మోహన్ కుమార్, సీఐ శంకరయ్య , ట్రాఫిక్ సీఐ రవీందర్ ,హైడ్రా అధికారి మోహన్ రావు , మున్సిపల్ (ఇ ఇ)రమేష్ బాబు, (డి ఇ ) సాయినాథ్ గౌడ్ , మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏ ఇ ), వర్క్ ఇన్స్పెక్టర్ లు,మున్సిపల్ సిబ్బంది, హైడ్రా సిబ్బంది, డి ఆర్ ఎఫ్ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగాచారి, అంజిరెడ్డి, బర్రె నాగరాజు,సోమయ్య, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి.



రేగొండ,మే,15 (భారత శక్తి ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో కల్లుగీత కార్మికుడు సోమవారం ఉదయం కల్లుగీస్తుండగా కిందపడి మృతి చెందిన సంఘటన రేగొండలో సోమవారం వెలుగు చూసింది. వివరాలలోకి వెళితే రేగొండ మండల కేంద్రం సంబంధించిన గండి సదయ్య (55), తన వృత్తిలో భాగంగా సోమవారం ఉదయం తాడిచెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు.దీంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అవడంతో అక్కడికక్కడే మరణించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

# బడి బోనమెత్తిన మాజీ సర్పంచ్

**- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని వినూత్న ప్రచారం**

**- ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను అభ్యర్థించిన భీమగాని రాములు మాధవి**

**-ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు పారితోషికం ప్రకటన**






భారత శక్తి, జూన్ 15 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో మాజీ సర్పంచ్ భీమగాని రాములు మాధవి ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా బడి బోనం కార్యక్రమం నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనం ఎత్తుకొని గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరుతూ బడి బోనం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులొఇ ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు బోధిస్తారని, పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ సదుపాయాలు కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేరిపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థినీ విద్యార్థులకు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ ఖర్చు తగ్గించుకోవాలని కోరుతున్నారని దీంతో పాటుగా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కూడా లక్షలాది రూపాయలు తల్లిదండ్రులకు మిగులుతాయని అన్నారు. ఈ సందర్భంగా పెద్ద కందుకూరు ప్రభుత్వ పాఠశాలలో చదివి మండల స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన బూడిద శశాంక్ ను శాలువాతో సన్మానించి 5000 రూపాయలు ప్రోత్సాహకం అందించారు. బడి బోనం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న మాజీ సర్పంచ్ భీమగాని రాములు మాధవిగౌడ్ లను పలువురు గ్రామస్తులు అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ గుండ్లపల్లి శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కాల్నె స్రవంతి రాజు, జాగిల్లపురం వనజ వెంకటేష్, స్వామి రామచందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(భారత శక్తి )ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**- గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం**

**- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(భారత శక్తి )సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి):నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం రోజు జిల్లా కలెక్టర్ కుమార్ సందర్శించారు. అనంతరం భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు.

## నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలి


**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారతశక్తి): నూతన విద్యా సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు.సోమవారం 2026-27 విద్యా సంవత్సరం తొలిరోజు సందర్భంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యను జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావించి కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా గది తదితర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా వాతావరణం, మౌలిక వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులు ప్రతిరోజూ పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు సాధారణ విజ్ఞానం, స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత చరిత్రలు, సాహిత్య పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని పోటీ ప్రపంచంలో రాణించేందుకు సిద్ధం కావాలని తెలిపారు.అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అందజేశారు. విద్యా సంవత్సరపు మొదటి రోజు నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని, ప్రతి రోజు నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యకలాపాలలో పాల్గొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 15 (భారత శక్తి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూర్ మండలం ఒతుకులపల్లి గ్రామానికి చెందిన కావేరి శోభ తన పేరు ఇందిరమ్మ మొదటి జాబితాలో వచ్చిందని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సెగ్గెం ప్రసాద్ ఎస్.సి. కులానికి చెందిన నిరుపేద అయిన తనకు జీవనాధారంగా ఆటో, రెండు పడక గదుల ఇల్లు అందజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కట్ల పోసక్క, కట్ల పోచం లు గ్రామ శివారులో చేపట్టిన అక్రమ కల్వర్టు నిర్మాణంలో తమ భూమి ఆక్రమణ జరుగుతుందని, ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్ నగర్ కు చెందిన సత్యనారాయణ రావు తనకు జిల్లాలోని లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామంలో గల భూమి గోదావరి నీటిలో మునిగిందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరపి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని దేవాపూర్ కు చెందిన కాంపెలి వెంకటేశం తన కుమారుడికి లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కళ్యాణి తనకు గృహజ్యోతి, గ్యాస్ రాయితీ పథకాలు వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy